# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

శనివారం, హైదరాబాద్ 01.03.2025 | 24 క్యారెట్లు 88,748.00 | కిలో వెండి 1,07,665.00 | 33 ℃ | సంపుటి:3 | సంచిక:130

www.vishalabharati.com





# టన్నెల్‌లో 8 మంది సజీవ సమాధి..?

- జీపీఆర్, ధర్మల స్కానర్లతో గుర్తింపు
- బురదలో కూరుకుపోయిన మృతదేహాలు
- మట్టిని తొలగించేందుకు ప్రత్యేక యంత్రాలు
- సహాయక చర్యలు ముమ్మరం చేసిన బృందాలు
- నేడు అధికారిక ప్రకటన వెలువడే అవకాశం
- తప్పుడు వార్తలు నమ్మొద్దన్న జిల్లా కలెక్టర్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ కథ విషాదాంతం అయినట్లు తెలుస్తోంది. దాదాపు వారం రోజులపాటు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగించినా ప్రయోజనం లేకపోయింది. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ లోపల చిక్కుకున్న 8 మంది కార్మికులు సజీవ సమాధి అయినట్లు రెస్క్యూ టీమ్ శుక్రవారం గుర్తించిందని వార్తలొస్తున్నాయి. 3 మీటర్ల లోతులో మృతదేహాలు ఉన్నాయని, అత్యాధునిక పరికరాలతో రెస్క్యూ టీమ్ గుర్తించినట్లు సమాచారం. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. అప్పడే టన్నెల్ లో చిక్కుకున్న కార్మికుల ఘటనపై ఓ క్లారిటీ రానుంది. టన్నెల్‌లో చిక్కున్న వారిలో ఆరుగురు కార్మికులు, ఇద్దరు ఇంజనీర్లు ఉన్నారు. ప్రమాదం జరిగినప్పటి నుంచే అధికారులు, రెస్క్యూ బృందాలు రంగంలోకి దిగి క్షతగాత్రుల ఆచూకీ కోసం గాలిస్తున్నారు. మట్టిలో వారు మూడు మీటర్ల

..మిగతా 2 లో

# తెలంగాణలో తగ్గనున్న ఎంపీ స్థానాలు!



## దక్షిణాదిపై డీలిమిటేషన్‌ఎఫెక్ట్

- జనాభా ప్రాతిపదికన విభజిస్తే నష్టమే
- ఐదు రాష్ట్రాల్లో 25 సీట్లు తగ్గే అవకాశం
- రాష్ట్రంలో 3 లేదా 4 సీట్లు కోల్పోయే చాన్స్
- ఉత్తరాది రాష్ట్రాల్లో పెరగనున్న 40 ఎంపీ సీట్లు
- తమకు అన్యాయం జరుగుతుందని దక్షిణాది ఆగ్రహం
- మార్చి 5న తమిళనాడు సీఎం అఖిలపక్ష భేటీ

*దక్షిణాది రాష్ట్రాల్లో డీలిమిటేషన్ చిచ్చు రేగుతోంది. వచ్చే ఎన్నికల నాటికి లోక్‌సభ నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ అంశం తెరమీదకు రావడంతో దక్షిణాది రాష్ట్రాల్లో అలజడి మొదలైంది. జనాభా ప్రాతిపదికన సీట్లను విభజిస్తే కొత్తగా పెరిగే స్థానాల సంగతేమో కానీ ఉన్నవాటికి కోత పడుతుందని దక్షిణాది రాష్ట్రాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల ఉత్తరాది రాష్ట్రాలకు భారీగా లబ్ధి చేకూరుతుందని వాపోతున్నారు. ఇన్నేళ్లుగా జనాభా నియంత్రణ పాటించడం కారణంగా తమకు నష్టం జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.*

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:** 2011 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకున్నా, 2026లో చేపట్టే జనగణనతో వచ్చే గణాంకాలను ప్రామాణికంగా తీసుకున్నా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు ఇబ్బందేనని ముఖ్యమంత్రులు వాపోతున్నారు. ఈ ఐదు రాష్ట్రాల్లో ప్రస్తుతం 120 ఎంపీ సీట్లు ఉంటే జనాభా లెక్కల ఆధారంగా డీలిమిటేషన్ చేస్తే దాదాపు 25 స్థానాలు తగ్గిపోతాయన్న ఆందోళన మొదలైంది. డీలిమిటేషన్‌పై కేంద్రం నుంచి ఎలాంటి ప్రకటన రాకున్నా ప్రమాదాన్ని నివారించేందుకు దక్షిణాది రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయి.

**ఉత్తరాది రాష్ట్రాలకే లాభం**

ఉత్తరాది రాష్ట్రాల్లో కుటుంబ నియంత్రణ పాలసీ పటిష్ఠంగా అమలు కాకపోవడంతో జనాభా గణనీయంగా పెరిగిందని, దీంతో దాదాపు 40 సీట్లు పెరుగుతాయన్న అంచనాలున్నాయి. ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే 14 లోక్ సభ స్థానాలు పెరిగే

..మిగతా 2 లో

# పింక్‌బుక్ మెయిన్ టైన్ చేస్తున్నాం..



- అందరి చిట్టా రాసి పెట్టుకుంటున్నాం
- బీఆర్ఎస్ కార్యకర్తల జోలికొస్తే ఖబడ్దార్
- మా టైమొస్తుంది.. వడ్డీతో సహా చెల్లిస్తాం

అధికారులకు, నేతలకు ఎమ్మెల్సీ కవిత వార్నింగ్

2 లో



# ఒక్కరోజే రూ.10 లక్షల కోట్ల నష్టం..

- స్టాక్ మార్కెట్లు ఢమాల్
- 1,414 పాయింట్లు క్షీణించిన సెన్సెక్స్
- 420 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ
- గడిచిన 5 నెలల్లో 16 శాతం వరకు నష్టపోయిన సూచీలు

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:** దేశీయ స్టాక్ మార్కెట్లను వాణిజ్య యుద్ధం భయాలు చుట్టుముట్టాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజా సుంకాల హెచ్చరికలు.. అంతర్జాతీయ మార్కెట్లను కుదిపేయగా,

..మిగతా 2 లో



# విరిగిపడ్డ మంచు చరియలు

- 22 మంది గల్లంతు
- ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం
- 33 మందిని కాపాడిన సైన్యం

2 లో

## మామునూర్ ఎయిర్ పోర్టుకు..

# కేంద్రం గ్రీన్ సిగ్నల్

### ఉత్తర్వులు జారీచేసిన పౌరవిమానయాన శాఖ

- సీఎం చొరవతోనే అనుమతులు మంజూరు
- వేగంగా నిర్మాణం జరిగేలా చూస్తాం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** వరంగల్ జిల్లా మామునూర్ ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతిని మంజూరీ చేసిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

..మిగతా 2 లో


# ప్రజల్లో ఉంటేనే గెలుస్తారు



- ఫ్లెక్సీలు, ఫొటోలతో ఉపయోగం లేదు
- కాంగ్రెస్ నేతలకు మీనాక్షి నటరాజన్ హెచ్చరిక
- రైల్వేస్టేషన్‌కు రావొద్దు.. నా బ్యాగులు మోయొద్దు
- ప్రభుత్వ పనులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆదేశాలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** అఖిల భారత కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ) తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ తన తొలి సమావేశంలోనే పనిచేయని నాయకులకు పరోక్షంగా ఘాటు హెచ్చరికలు జారీ చేశారు. ఇన్‌ఛార్జిగా నియమితులయ్యాక ఆమె తొలిసారిగా హైదరాబాద్‌కు విచ్చేశారు. శుక్రవారం ఉదయం కాచిగూడ రైల్వేస్టేషన్‌కు చేరుకోగా.. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు, రోహిన్‌రెడ్డి తదితరులు స్వాగతం

..మిగతా 2 లో



# పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

## మార్చి 5 నుంచి నిర్వహణ

..మిగతా 2 లో

- సీసీ కెమెరాలతో పరీక్ష కేంద్రాల్లో నిఘా
- సమీపంలోని జిరాక్స్‌సెంటర్లు మూసివేత
- అధికారులతో సీఎస్‌శాంతికుమారి సమీక్ష



# 3 ఎకరాల వారికి రైతు భరోసా విడుదల

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- గ్రామాల్లో ఫ్లెక్సీల ద్వారా ప్రదర్శించాలి
- అధికారులకు కీలక ఆదేశాలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రైతులకు రేవంత్ రెడ్డి సర్కార్ తీపికబురు వినిపించింది. 3 ఎకరాల వరకు సాగు భూమి ఉన్న అన్నదాతలకు రైతు భరోసా నిధుల విడుదల

..మిగతా 2 లో

# కేసీఆర్.. మళ్లీ డుమ్మా

- వివరాలు ఇవ్వని మాజీ సీఎం
- ముగిసిన కులగణన రీ సర్వే
- 18,539 కుటుంబాలే నమోదు
- మొదటి సర్వేలో మిగిలిన కుటుంబాలు 3.56 లక్షలు
- మొత్తంగా 97.08 శాతం సర్వే పూర్తి



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కులగణన సర్వేలో 3 కోట్ల 4 లక్షల మందికి పైగా వివరాలు నమోదు చేసిన విషయం తెలిసిందే. అయితే కులగణన పూర్తి స్థాయిలో చేయలేదనే విమర్శలు రావడంతో మరో 12 రోజులపాటు కులగణన రీసర్వే చేయాలని నిర్ణయించింది సర్కార్. ఈ నెల 16వ తేదీ నుంచి నేటి వరకు 12 రోజుల పాటు రీ సర్వే కొనసాగింది. రెండో దఫా మొత్తం మూడు పద్ధతుల్లో వివరాలను ప్రభుత్వం సేకరించింది. టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి తమ వివరాలు పొందుపర్చుకోవడం, ప్రజాపాలనా సేవా కేంద్రాలకు వెళ్లి వివరాలు

..మిగతా 2 లో

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శనివారం, 01.03.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com
vishalabharathi Telugu Daily



# తెలంగాణలో తగ్గనున్న ఎంపీ స్థానాలు!

తరువాయి భాగం

అవకాశాలున్నాయి. రాజస్థాన్, హర్యానా, బిహార్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో మరో 25 పెరుగుతాయని అంచనా. యూపీ, హర్యానా, బీహార్, రాజస్థాన్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో అత్యధిక స్థానాలు గెలుచుకున్న పార్టీయే కేంద్రంలో అధికారంలోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని.. దక్షిణాది రాష్ట్రాల అవసరమే ఉండక పోవచ్చని కేరళలో ఈ నెల రెండోవారంలో నిర్వహించిన మాతృభూమి ఇంటర్నేషనల్ ఫెస్టివల్‌లో తెలంగాణ సీఎం రేవంత్ వ్యాఖ్యనించారు. ఐదు దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మాజీ సీఎంలు, ప్రాంతీయ పార్టీల నేతలు డీలిమిటేషన్‌తో లోక్‌సభ స్థానాలు తగ్గుతాయనే ఆందోళనలో ఉన్నారు. ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలను కని జనాభా సంఖ్య పెంచాలని ఏపీ, తమిళనాడు సీఎంలు చంద్రబాబు, స్టాలిన్ ఇటీవల పలు వేదికలపై పిలుపునిచ్చారు.

**మార్చి 5న తమిళనాట అఖిలపక్ష మీటింగ్**

డీలిమిటేషన్ ప్రమాదాన్ని గ్రహించిన తమిళనాడు సీఎం స్టాలిన్ రాజకీయాలకు అతీతంగా మార్చి 5న సుమారు 45 గుర్తింపు పొందిన పార్టీలతో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయబోతున్నారు. ఆర్థికవృద్ధి రేటులో, కేంద్ర పన్నుల వసూళ్లల్లో దక్షిణాది రాష్ట్రాలు మంచి ఫలితాలను సాధిస్తున్నాయని, ఫ్యామిలీ ప్లానింగ్ ద్వారా జనాభాను కూడా నియంత్రించాయని గుర్తుచేశారు. ఏపీ సీఎం చంద్రబాబు సైతం గతంలో డీలిమిటేషన్‌కు జనాభా లెక్కలను ప్రామాణికంగా తీసుకుంటే జరగబోయే ప్రమాదాన్ని పసిగట్టి పిల్లల్ని ఎక్కువగా కనాలంటూ ఇటీవల పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నందున బీజేపీతో, ప్రధానితో కొట్లాడేకంటే పరోక్షంగా రాష్ట్ర జనాభా పెరగాల్సిన ఆవశ్యకతపై దృష్టి పెట్టారు.

**తెలుగు రాష్ట్రాల్లో తగ్గనున్న స్థానాలు**

జనాభా లెక్కలను (2011 లేదా 2026) పరిగణనలోకి తీసుకుంటే తెలంగాణలో ప్రస్తుతం ఉన్న 17 లోక్‌సభ స్థానాల్లో మూడు లేదా నాలుగు తగ్గే అవకాశమున్నది. తమిళనాడులో 39 స్థానాల్లో 9, కేరళలోని 20 సీట్లలో 6, కర్ణాటకలోని 28లో 2, కేరళలోని 20లో 6, ఏపీలో 25లో 5 సీట్ల చొప్పున మొత్తం 24 లేదా 25 ఎంపీ స్థానాలు తగ్గే అవకాశమున్నది. ప్రస్తుతం ఈ ఐదు రాష్ట్రాల్లో 120 ఎంపీ సీట్లు ఉంటే అది 95 లేదా 96కు పరిమితం కావచ్చని అంచనా. తమిళనాడు సీఎం స్టాలిన్ అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి ఈ అంశాన్ని చర్చిస్తుండడంతో కేంద్ర హోం మంత్రి అమిత్ షా బుధవారం కోయంబత్తూరు పర్యటన సందర్భంగా... ఇప్పుడున్న ఎంపీ సీట్లకు కోతపడే అవకాశమే లేదని, లోక్‌సభ వేదికగానే ప్రధాని మోదీ గతంలోనే క్లారిటీ ఇచ్చారని గుర్తుచేశారు. తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ సైతం మూడేండ్ల క్రితం తమిళనాడు పర్యటన సందర్భంగా సీఎం స్టాలిన్‌తో డీలిమిటేషన్, సీట్లపై పడే ప్రభావం గురించి చర్చించారు.

# పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

విశాలభారతి, స్టేట్ బ్యూరో: తెలంగాణలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కాబోతున్నాయి. మార్చి 5 నుంచి ఇంటర్ పరీక్షలు జరుగనున్నాయి. ఈనేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 5వ తేది నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఏర్పాట్లను ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి సమీక్షించారు. ఈ సమీక్షలో ఇంటర్మీడియట్ బోర్డ్ సెక్రటరీ శ్రీ. కృష్ణ ఆదిత్య, జిల్లాల కలెక్టర్ లు, డిజిపి తెలంగాణ, సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ లు. జిల్లా ఇంటర్మీడియట్ పరీక్షా నిర్వహణ కమిటీలు వీడియోకాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఇంటర్ పరీక్షలపై జరిపిన సమీక్షలో సీఎస్ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులను పూర్తిగా తనిఖీ చేసిన తరువాత మాత్రమే పరీక్షా కేంద్రంలోనికి అనుమతించాలని, పరీక్షలు సజావుగా జరిపేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమిష్టిగా సమన్వయంతో పనిచేయాలని సీఎస్ ఆదేశించారు. ఇంటర్మీడియట్ బోర్డ్ సెక్రటరీ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 1532 పరీక్షా కేంద్రాలలో పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయని, జిల్లా అధికారులతో పరీక్షా నిర్వహణకు సమీక్షాసమావేశాలు నిర్వహించి రెవెన్యూ, పోలీస్, పోస్టల్, వైద్య, రవాణా, విద్యుత్ అధికారులకు ముందస్తు ఏర్పాట్లకై సమాచారం ఇవ్వడం జరిగిందన్నారు.

# ప్రజల్లో ఉంటేనే గెలుస్తారు

తరువాయి భాగం

పలికారు. అనంతరం దిల్‌కుషా గెస్ట్‌హౌస్‌కు చేరుకోగా సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వారితో కలిసి గాంధీభవన్‌కు చేరుకొన్న మీనాక్షి పీసీసీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నాయకులు ఫ్లెక్సీలు, ఫొటోలు పెడితే ఎన్నికల్లో గెలవరని, నిరంతరం ప్రజల్లో ఉంటేనే గెలుస్తారని స్పష్టం చేశారు. "ఇప్పుడు మనం ప్రభుత్వంలో ఉన్నాం. పేదవారి ముఖంలో నవ్వులు చూసినప్పుడే పనిచేసినట్టు అర్థం. పదేళ్లుగా కష్టపడిన కార్యకర్తలకు న్యాయం జరగాలి. దేశంలో ఎక్కడా లేనివిధంగా కులగణన పూర్తి చేయడం గొప్ప విషయం. ప్రతి గ్రామానికి వెళ్లి జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాలను పెద్దఎత్తున చేపట్టాలి. పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించేలా పీసీసీ ఒక పకడ్బందీ క్యాలెండర్ సిద్ధం చేయాలి. ఇకపై నా కోసం నాయకులు ఎవరూ రైల్వే స్టేషన్లకు రావొద్దు. నా బ్యాగులు ఎవరూ మోయొద్దు. వాటిని మోసేంత బలం లేకపోతే నేనే మీ సహాయం అడుగుతా. మీ ఆత్మగౌరవాన్ని ఎక్కడా తక్కువ చేసుకోవద్దు. మీరు మీ పని చేసుకోండి. పార్టీని గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు బలోపేతం చేయండి. కార్యకర్తలు ఎప్పుడు ఫోన్ చేసినా మాట్లాడతా" అని మీనాక్షి చెప్పారు.

# కేసీఆర్.. మళ్లీ డుమ్మా

విశాలభారతి, స్టేట్ బ్యూరో: ఇవ్వడం, ఆన్ లైన్ లో ఫామ్ డౌన్ లోడ్ చేసుకుని కుటుంబ వివరాలు నమోదు చేసి ఆ వివరాలు ప్రజాపాలనా సేవా కేంద్రంలో సమర్పించడం ఈ మూడు పద్ధతుల్లో ఈసారి ప్రభుత్వం అవకాశం కల్పించింది. 2024 నవంబర్ 6న ప్రారంభించి డిసెంబర్ 25 వరకు 50 రోజుల పాటు సాగిన తొలి దఫా సర్వేలో మొత్తం 1,15,71,457 కుటుంబాలకు గాను 1,12,15,134 కటుంబాల(96.9 శాతం)ను సర్వే చేశామని సీఎం అసెంబ్లీలో వెల్లడించారు. అయితే ఇంకా 3.1 శాతం (3,56,323) కుటుంబాలను సర్వే చేయలేదని చెప్పారు. మిగిలిపోయిన వారి కోసం మరో అవకాశం ఇవ్వాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. అయితే మరోసారి అవకాశం కల్పించినా ఈ కుల గణన సర్వేలో 18,539 కుటుంబాలే నమోదు చేయించుకున్నట్లు తెలుస్తోంది. గతంలో మిగిలిపోయిన వారిలో 5.21 శాతం మందే వివరాలు నమోదు చేశారు. దీంతో రెండు సర్వేలు కలిపితే 97.08 శాతం లెక్కలు పూర్తయ్యాయి. రెండో దఫా సర్వేలోనూ కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు పాల్గొనకపోవడం రాజకీయంగా ఆసక్తిగా మారింది. కాగా కేసీఆర్ ఫ్యామిలీలో కల్వకుంట్ల కవిత ఒక్కరే తొలివిడత సర్వేలోనే తమ వివరాలను నమోదు చేసుకోగా రీ సర్వే నిర్వహిస్తే తాను కేసీఆర్ పాల్గొంటామని చెప్పిన కేటీఆర్.. రీ సర్వేలో మాత్రం పాల్గొనకుండా దూరంగా ఉన్నారు.

# విరిగిపడ్డ మంచు చరియలు

విశాలభారతి, నేషనల్ బ్యూరో: ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో మంచు చరియలు విరిగిపడ్డ ఘటనలో సహాయకచర్యలు కొనసాగుతున్నాయి. ఈ ప్రమాదంలో 55 మంది కార్మికులు మంచు కింద చిక్కుకున్నారు. వారిలో 33 మంది కార్మికులను సురక్షితంగా రక్షించారు. మిగిలిన 22 మంది కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయని విపత్తు నిర్వహణ శాఖ తెలిపింది. సైన్యం యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు నిర్వహిస్తోంది. మొదట 57 మంది చిక్కుకున్నట్లు భావించారు. చమోలీ జిల్లా మేజిస్ట్రేట్ (కలెక్టర్) సందీప్ తివారీ మాట్లాడుతూ, "తొలుత 57 మంది అని తెలిసింది. కానీ, చిక్కుకుపోయింది 55 మంది. ఇద్దరు సెలవులో ఉన్నారు. ఇప్పటి వరకూ 33 మందిని సురక్షితంగా తీసుకొచ్చాం. మరో 22 మంది ఆచూకీ తెలియాల్సి ఉంది" అని చెప్పారు. బద్రీనాథ్ ధామ్‌కు సమీపంలోని మాణా గ్రామం వద్ద, శుక్రవారం మధ్యాహ్నం ఈ ప్రమాదం జరిగింది. ఆర్మీ కోసం జరుగుతున్న ఓ రోడ్డు నిర్మాణంలో 55 మంది కార్మికులు పనిచేస్తున్నారని, వారంతా మంచుచరియల్లో చిక్కుకుపోయారని సందీప్ తివారీ చెప్పారు. సైన్యంతో పాటు, ఐటీబీపీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ రెస్క్యూ బృందాలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయని తెలిపారు.

# టన్నెల్‌లో 8 మంది సజీవ సమాధి..?



తరువాయి భాగం

లోతులో కూరుకుపోయినట్లు అధునాతన పరికరాలు సూచించాయి. గ్రౌండ్ పెనట్రేటింగ్ రాడార్ (జీపీఆర్) మెషీన్ ద్వారా మట్టి లో కూరుకుపోయిన 5 మృతదేహాలు గుర్తించినట్లు తెలుస్తోంది ఈ 5 మృతదేహాలను వెలికి తీయడానికి మరింత సమయం పడుతుందని, కొన్ని మీటర్ల లోతు మట్టి లో మృతదేహాలు కూరుకు పోయినట్లు తెలుస్తోంది. మిగతా ముగ్గురి మృతదేహాల కోసం అధికారులు గాలిస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. ప్రమాద స్థలంలో రక్షణ చర్యలను వేగవంతం చేసేందుకు నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (NGRI) రంగంలోకి దిగింది. భూమిలో కూరుకుపోయిన వారి స్థితిని తెలుసుకునేందుకు ఆధునిక టెక్నాలజీని ఉపయోగిస్తోంది. జీరో గ్రావిటీ పెనట్రేటింగ్ రాడార్ (GPR) టెక్నాలజీని ఉపయోగించి, భూమిలోకి తొలగిపోయిన వారిని గుర్తించేందుకు ప్రత్యేక బృందం శ్రమిస్తోంది. మిషన్ ఆధారంగా ఎన్జీఆర్ఐ బృందం టన్నెల్‌ను పూర్తిగా స్కాన్ చేసింది. NGRI టీమ్, జీపీఆర్‌సాయంతో టన్నెల్‌లో ఐదు అనుమానాస్పద ప్రదేశాలను గుర్తించింది. ఈ ప్రాంతాల్లో శరీర నిఘా కోసం మార్కింగ్ నిర్వహించారు. బురద, రాళ్లు తొలగించేందుకు రక్షణ బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. అయితే దీనిపై నేడు అధికారిక ప్రకటన వెలువడనుంది. రెండు రోజుల్లో రెస్క్యూ ఆపరేషన్ పూర్తిచేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

**కలెక్టర్ ఏమన్నారంటే.?**

టన్నెల్‌లో చిక్కుకుని పోయిన కార్మికులు సజీవ సమాధి అవుతున్నారనే ప్రచారం నేపథ్యంలో జిల్లా కలెక్టర్ బడావత్ సంతోష్ స్పందించారు. ప్రభుత్వం నుంచి కానీ, అధికారుల నుంచి కానీ పూర్తి స్పష్టమైన సమాచారం లేనిదే అలాంటి వార్తల్ని పంచుకోవద్దని కోరారు. కార్మికుల కోసం గాలింపు తీవ్రంగా కొనసాగుతోందని, వారి ఆచూకీ ప్రస్తుతానికి ఇంకా లభించలేదన్నారు. ఏదైనా సమాచారం అందితే.. సంబంధిత శాఖల ద్వారా మాత్రమే తెలుసుకోవాలని సూచించారు.

# పింక్‌బుక్ మెయిన్ టైన్ చేస్తున్నాం..

విశాలభారతి, స్టేట్ బ్యూరో: తెలంగాణలో బీజేపీ కాషాయ బుక్ మెయిన్‌టైన్ చేస్తున్నామని బీజేపీ ప్రకటిస్తే....ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ పింక్ బుక్ మెయిన్‌టైన్ చేస్తున్నట్లు ఆ పార్టీ నేత, ఎమ్మెల్సీ కవిత వెల్లడించారు. పింక్ బుక్ మెయిన్ టైన్ చేస్తున్నామని దాంట్లో ప్రతీ ఒక్కరి చిట్టా రాసి పెట్టుకుంటున్నట్లు ఎమ్మెల్సీ కవిత హెచ్చరించారు. గతంలోనే పింక్ బుక్ రాస్తున్నామని ఆ పార్టీ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా ఎమ్మెల్సీ కవిత తాము పింక్ బుక్ మెయిన్‌టైన్ చేస్తున్నట్లు ప్రకటించడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

**పింక్ బుక్ మెయిన్‌టైన్ చేస్తున్నాం**

నాగర్ కర్నూల్ జిల్లా సింగోటంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పర్యటించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు పై ఎమ్మెల్సీ కవిత తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి సొంత జిల్లా నుంచి చెబుతున్నా... ఖచ్చితంగా పింక్ బుక్కు మైంటైన్ చేస్తాం అని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ కార్యకర్తలను వేధించే ఎంత పెద్ద నాయకులైనా, అధికారులనైనా ఎవరిని వదిలిపెట్టం అని చెప్పుకొచ్చారు. పింక్ బుక్కులో అందరి చిట్టా రాసుకుంటాం. మాకు కూడా టైం వస్తుంది... అప్పుడు అందరి సంగతి చెప్తాం అని కవిత హెచ్చరించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావుపై ఎమ్మెల్సీ కవిత హెచ్చరించారు. బీఆర్ఎస్ కార్యకర్తలను తీవ్రంగా వేధిస్తున్నారు అని మండిపడ్డారు. చిన్న విమర్శ చేసినా, ప్రశ్నించినా అక్రమ కేసులు పెట్టిస్తున్నారు. శ్రీధర్ రెడ్డి అనే కార్యకర్తను దారుణంగా చంపేసినప్పటికీ పోలీసులు కేసు దర్యాప్తును ముమ్మరం చేయడం లేదు అని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు.

**జూపల్లి టూరిస్ట్ మినిస్టర్**

కాంగ్రెస్ నాయకులు హంతకులకు కొమ్ముకాస్తున్నారు అని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. తమ మీటింగు కోసం ఫ్లెక్సీలు కడితే పరమేశ్వర్ అనే కార్యకర్తపై మంత్రి జూపల్లి కృష్ణారావు దాడి చేయించారు అని మండిపడ్డారు. ఇదేమి రాజ్యం ? కాంగ్రెస్ నాయకులు ఎందుకు భయపడుతున్నారు ? అని ప్రశ్నించారు. కొల్లాపూర్ నియోజక వర్గానికి జూపల్లి కృష్ణారావు టూరిస్ట్ మంత్రిగా వ్యవహరిస్తున్నారు అని మండిపడ్డారు. ఎప్పుడో ఒకసారి మాత్రమే ఆయన నియోజకవర్గానికి వస్తున్నారు అని ధ్వజమెత్తారు. సన్న వడ్లకు బోనస్ అని చెప్పి భోగస్ చేసిందని మండిపడ్డారు. రైతు భరోసా, రుణమాఫీ గ్రామాల్లో సగం మందికి కూడా రాలేదు అని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు.


# 3 ఎకరాల వారికి రైతు భరోసా విడుదల

తరువాయి భాగం

ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం ఉదయం ప్రజాభవన్‌లో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్ రావు, డైరక్టర్ గోపీ సహా ఆర్థిక, వ్యవసాయ శాఖల అధికారులతో భట్టి విక్రమార్క సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన భట్టి విక్రమార్క.. కీలక ఆదేశాలు జారీ చేశారు. మూడెకరాలలోపు రైతు భరోసా లబ్ధిదారుల వివరాలను గ్రామాల్లో ఫ్లెక్సీల ద్వారా ప్రదర్శించాలని అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. లబ్ధిదారుల వివరాలు గ్రామ కూడళ్లలో అందరికీ కనిపించేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని భట్టి సూచించారు. అనంతరం.. మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుతో కలిసి భట్టి విక్రమార్క బ్యాంకర్ల సమావేశంలో పాల్గొన్నారు. వ్యవసాయరంగానికి సంబంధించిన బ్యాంకింగ్ సేవలు, రుణాల మంజూరుపై చర్చించారు. రైతులకు అందుతున్న ఆర్థిక సాయం, పథకాల అమలు పురోగతిపై భట్టి విక్రమార్క సమీక్షించారు.ఈ సమావేశంలో మాట్లాడిన భట్టి విక్రమార్క తెలంగాణ అభివృద్ధి చెందుతున్న రాష్ట్రమని.. ఇందులో బ్యాంకర్లు కీలక భాగస్వాములని పేర్కొన్నారు. స్కిల్ యూనివర్సిటీ, ఐటీఐల అడ్వాన్స్‌మెంట్ ద్వారా నైపుణ్యం కలిగిన మానవ వనరులను, ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా, శాంతి భద్రతలతో.. మంచి వాతావరణం కల్పించి ప్రపంచాన్ని ఆకర్షిస్తున్నామని చెప్పుకొచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ కృషి ఫలితంగా దావోస్‌లో 1.80 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగినట్టు గుర్తుచేశారు. వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని చెప్పడమే కాదు.. చేసి చూపించామని భట్టి విక్రమార్క తెలిపారు. ఒక్క వ్యవసాయ రంగానికే రూ.52 వేల కోట్లు కేటాయించినట్టు భట్టి పేర్కొన్నారు. 2 నుంచి 3 నెలల వ్యవధిలోనే రైతు రుణమాఫీ కింద సుమారు రూ.22 వేల కోట్లు రైతుల ఖాతాలో జమ చేశామని తెలిపారు. భారతదేశ చరిత్రలో ఇది ఒక రికార్డుగా అభివర్ణించారు. ప్రభుత్వ నిర్ణయంతో రైతులతో పాటు బ్యాంకర్లకు కూడా మేలు జరిగిందని, సింగిల్ ఖాతా ద్వారా రూ.22 వేల కోట్లు బ్యాంకుల్లో జమయ్యాయని.. సింగిల్ స్ట్రోక్‌తో పెద్ద మొత్తంలో బ్యాంకర్లకు రికవరీ జరిగిందని బ్యాంకర్లు ప్రభుత్వాన్ని అభినందించాలన్నారు.

# మామునూర్ ఎయిర్ పోర్టుకు.. కేంద్రం గ్రీన్ సిగ్నల్

తరువాయి భాగం



తెలిపారు. ఈ మేరకు మామునూర్ ఎయిర్ పోర్ట్ కు అనుమతిని మంజూరీ చేస్తూ కేంద్ర పౌరవిమానయాన మంత్రిత్వశాఖ కార్యదర్శి అమిత్ కుమార్ జా, ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఛైర్మన్ కు శుక్రవారం నాడు లేఖ ద్వారా తెలియజేసినట్లు మంత్రి తెలిపారు. మామునూర్ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసి, తిరిగి కార్యకలాపాలు ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విమానాశ్రయ ప్రాధికార సంస్థ అభ్యర్థనకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వంతో ముఖ్యమంత్రి పలుదఫాలుగా చర్చలు జరిపి ప్రాజెక్టు పట్టాలెక్కించడంలో చొరవ చూపడంతోనే ఇవాళ అన్ని అనుమతులు మంజూరయ్యాయని మంత్రి తెలిపారు.

గత పదేండ్లుగా పెండింగ్ లో ఉన్న ఎన్వోసీ అడ్డంకిని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి జీఎంఆర్ సంస్థ యాజమాన్యంతో సంప్రదింపులు జరిపి, బోర్డులో పెట్టి ఎన్వోసీ ఇచ్చేలా చేశారు. దీంతో హెచ్ఏఐఎల్‌తన బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ మీటింగ్ ఏర్పాటు చేసుకొని మామునూర్ విమానాశ్రయ అభివృద్ధికి అడ్డంకిగా ఉన్న 150 కిలోమీటర్ల నిబంధనను సవరిస్తూ ఎన్వోసీ ఇచ్చారు. ఇప్పుడు ఈ ఎన్వోసీని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఆమోదించిందని మంత్రి తెలిపారు. ఈ మేరకు కేంద్ర పౌరవిమానయాన మంత్రిత్వశాఖ కార్యదర్శి అమిత్ కుమార్ జా, ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఛైర్మన్ కు లేఖ ద్వారా తెలిపినట్లు మంత్రి వివరించారు. గౌరవ ముఖ్యమంత్రి సహకారంతో.. ఎయిర్ పోర్టు నిర్మాణం మరింత వేగంగా ముందుకు తీసుకెళ్తామని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. విమానాశ్రయ ప్రాధికార సంస్థ (AAI) UO నోట్ నెం. PLG/501/Warangal /2025/80 తేదీ 03.02.2025 ప్రకారం, తెలంగాణ ప్రభుత్వం 05.12.2024 మరియు 17.11.2024 తేదీలలో పంపిన లేఖలను ప్రస్తావిస్తూ, హైదరాబాదు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (HIAL) మామునూర్ ఎయిర్ పోర్ట్ అభివృద్ధికి 'నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ 'జారీ చేసినట్లు లేఖలో పేర్కొందని తెలిపిన మంత్రి అందుకు సంబంధించిన లేఖను విడుదల చేశారు. అంతేకాదు, మామునూర్ ఎయిర్ పోర్ట్ అభివృద్ధికి కావాల్సిన 253 ఎకరాల అదనపు భూమిని తెలంగాణ ప్రభుత్వం విమానాశ్రయ ప్రాధికార సంస్థ (AAI) కి అప్పగించేందుకు ఇంతకు ముందే 205 కోట్ల రూపాయలను విడుదల చేసిన విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపిన మంత్రి.. ఎయిర్ పోర్టుకు కావాల్సిన అన్ని అనుమతులు రావడంపై హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ నిర్మించేటప్పుడు కేంద్రంతో.. హైదరాబాదు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (హెచ్ఐఏఎల్) సంస్థ చేసుకున్న ఒప్పందంలోని క్లాజ్ 5.2 లో 25 సంవత్సరాల లోపల, 150 కిలోమీటర్ల పరిధిలో ప్రస్తుతం అందుబాటులో ఉండి అభివృద్ధి చేసేవి మరియు మరో కొత్త దేశీయ/అంతర్జాతీయ విమానాశ్రయానికి అనుమతించరాదని ఆనాడు HIALకేంద్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. దీంతో ఈ పరిధిలో రాష్ట్రంలో ఇప్పటి వరకు మరో ఎయిర్ పోర్టు నిర్మాణం జరగలేదు. అయితే, రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖా మాత్యులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అభ్యర్థన మేరకు HAIL తన బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ మీటింగ్ ఏర్పాటు చేసుకొని మామునూర్ విమానాశ్రయ అభివృద్ధికి అంగీకారం తెలిపింది. కేంద్ర ప్రభుత్వంతో ముఖ్యమంత్రి గారు పలుదఫలుగా చర్చలు జరిపి ప్రాజెక్టు పట్టాలెక్కించడంలో చొరవ చూపడంతోనే ఇవ్వాల అనుమతులు మంజూరీ అయ్యాయని మంత్రి తెలిపారు.

# ఒక్కరోజే రూ.10 లక్షల కోట్ల నష్టం..

తరువాయి భాగం

ఆ ప్రభావం భారతీయ ఈక్విటీలపైనా కనిపించింది. శుక్రవారం ఉదయం ఆరంభం నుంచే భారీ నష్టాల్లో కదలాడిన సూచీలు.. సమయం గడుస్తున్నకొద్దీ మరింతగా పతనమైపోయాయి. ఈ క్రమంలోనే ఈ ఒక్కరోజే లక్షల కోట్ల రూపాయల మదుపరుల సంపద ఆవిరైపోయింది. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,414.33 పాయింట్లు లేదా 1.90 శాతం క్షీణించి 73,198.10 వద్ద ముగిసింది. ఒకానొక దశలోనైతే 1,471.16 పాయింట్లు పడిపోయింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ కూడా 420.35 పాయింట్లు లేదా 1.86 శాతం దిగజారి 22,124.70 దగ్గర స్థిరపడింది.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శనివారం,
01.03.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



vishalabharathi Telugu Daily

## ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

**కోదాడ, విశాలభారతి:**

జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా శ్రీ చైతన్య స్కూల్లో సైన్స్ ఎక్స్పో 2025 నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కోదాడ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ షేక్ జిలాని, ఏఈ జీవన్ ముఖ్య అతిథులుగా పాల్గొని వారు మాట్లాడుతూ జీవితంలో సైన్స్ యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించడం జరిగింది. ఈ సృష్టిలో ప్రతిదీ సైన్స్ ద్వారానే ముందుకు వెళుతుందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాబోయే రోజులలో సైన్స్ యొక్క ప్రాముఖ్యత ఎంతో అవసరం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం మురళీకృష్ణ, ఆర్ఐ దండా వెంకటయ్య, ప్రిన్సిపల్స్ గోపాలస్వామి, వీరారెడ్డి, ప్రశాంతి, డీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





## వేసవికాలంలో మూగజీవాల దాహాన్ని తీర్చుదాం

- GHMC డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి.

**ఎల్బీనగర్ ,విశాలభారతి :**

మన్సూరాబాద్ డివిజన్ కాస్మోపాలిటన్ కాలనీలోని GHMC డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి వేసవికాలం దృశ్య మూగజీవాలకు ప్రతి ఒక్కరి ఇంటి బయట వాటి దాహాన్ని తీర్చేందుకు నీళ్లను ఏర్పాటు చేయాలని జిహెచ్ఎంసి వెటర్నరీ సిబ్బందితో కలిసి వారి ఇంటి బయట మూగ జీవాల కొరకు నీళ్లను ఏర్పాటు చేసి విధంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం వివిధ కాలనీలలో అందరూ బయట వారి వాకిలి పైపులతో కడగకుండా ఒక బకెట్ నీళ్లతో చల్లుకోవాలని, ఇతర అవసరాలకు వేసవి కాలం దృష్టిలో పెట్టుకొని నీళ్లను వృధా చేయొద్దని సూచించారు. అదేవిధంగా ఎల్బీనగర్ ప్రజలందరూ మూగజీవాలు నీళ్లు తాగేందుకు ప్రతి ఒక్కరి ఇంటి బయట నీళ్లను బకెట్లలో, టాబులలో, పెద్ద బాటిల్స్ ని కట్ చేసి వాటిలలో ఏర్పాటు చేయాలని కోరారు.





# సరళమైన భాషలో యోచిస్తే ఉత్తమ పరిష్కారాలు

- గీతం ఛేంజ్ మేకర్స్ కార్యక్రమం, సైన్స్ దినోత్సవ వేడుకల్లో పేర్కొన్న డాక్టర్ కృష్ణ ఎల్లా

**పటాన్ చెరు,విశాలభారతి:**

సరళమైన భాషలో సైన్స్ గురించి ఆలోచిస్తే, ప్రపంచానికి ఉత్తమ పరిష్కారాలను కనుగొంటారని పద్మభూషణ్ అవార్డు గ్రహీత, ప్రఖ్యాత భారతీయ శాస్త్రవేత్త, వ్యవస్థాపకుడు, వ్యాక్సిన్ ఆవిష్కర్త డాక్టర్ కృష్ణ ఎల్లా అన్నారు. వ్యవసాయ కుటుంబంలో తన పెంపకాన్ని గుర్తుచేసుకుంటూ, డాక్టర్ ఎల్లా శాస్త్రీయ విచారణలో సరళత యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా, గీతం ఛేంజ్ మేకర్స్ సిరీస్ లో భాగంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో భారత్ బయోటెక్ ఎండీ, ముఖ్యకార్యనిర్వహణాధికారి డాక్టర్ ఎల్లా సైన్స్, వ్యవస్థాపకతలో తన అద్భుతమైన ప్రయాణాన్ని పంచుకున్నారు. తన లోతైన అవగాహన, అనుభవాల ద్వారా గీతం విద్యార్థులతో పాటు జంట నగరాల్లోని పది ప్రముఖ కళాశాలల నుంచి వచ్చిన 550 మందితో పాటు, పరిశోధకులకు కూడా స్ఫూర్తినిచ్చారు. డాక్టర్ ఎల్లా భారత్ బయోటెక్ ను స్థాపించడం నుంచి కోవాక్సిన్, టైఫ్బార్ టీసీవీ, రోటావాక్ వంటి సంచలనాత్మక వ్యాక్సిన్ ల అభివృద్ధి వరకు తన ప్రయాణాన్ని వివరించారు.ప్రపంచవ్యాప్తంగా నాలుగు బిలియన్లకు పైగా వ్యాక్సిన్ మోతాదులు పంపిణీ చేయడంతో పాటు, అనువాద పరిశోధనకు ఆయన చేసిన కృషి ప్రపంచ ఆరోగ్య సంరక్షణను మార్చడంతో పాటు లక్షలాది మంది జీవితాలను సానుకూలంగా ప్రభావితం చేస్తోంది అనడంలో అతిశయోక్తి లేదు. ఊహ, ఆచరణాత్మకతకు విలువనిచ్చే ఆవిష్కరణ సంస్కృతిని సమర్థిస్తూ, యువ మనస్సులు తమ పరిసరాలను గమనించి ప్రశ్నలు అడగాలని డాక్టర్ ఎల్లా ప్రోత్సహించారు. 'ప్రపంచం చాలా విభజించబడింది, ఆ అంతరాన్ని తగ్గించడానికి ఆవిష్కరణ కీలకం. భారతదేశం 12 నుంచి 15 శాతం జాతీయ స్థూల ఉత్పత్తి (జీడీపీ) వృద్ధిని కోరుకుంటే, ఆవిష్కరణ మాత్రమే సాధ్యం' అని ఎల్లా స్పష్టీకరించారు. భారతదేశంలో ప్రస్తుత ఆవిష్కరణ స్థితిపై ఆయన విచారం వ్యక్తం చేస్తూ, అందుబాటులో ఉన్న శాస్త్రీయ జ్ఞాన సంపదను గుర్తించాలని, సైన్స్ యొక్క ప్రాథమిక సూత్రాలను స్వీకరించాలని భావి పౌరులను కోరారు. కేవలం ఇద్దరు ఉద్యోగులతో ప్రారంభమైన భారత్ బయోటెక్ ప్రయాణం, ప్రస్తుతం ఐదు ప్రదేశాలలో నాలుగు వేల మంది బృందానికి ఎదిగిందన్నారు. జీవితంలో అంతర్భాగంగా క్లినికల్ పరిశోధన యొక్క ప్రాముఖ్యతను, సమస్య పరిష్కారం వైపు దృక్పథంలో మార్పు యొక్క అవసరాన్ని డాక్టర్ ఎల్లా ఎత్తి చూపారు. ముందుగా, ఈ కార్యక్రమంలో గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్ మతుకుమిల్లి, గీతం ఛాన్స్ లర్ డాక్టర్ వీరందర్ సింగ్ చౌహాన్ డాక్టర్ ఎల్లాను సత్కరించారు. ఐఐసీటీ పూర్వ డైరెక్టర్, గీతం విశిష్ట ఆచార్యుడు డాక్టర్ శ్రీవారి చంద్రశేఖర్ అతిథిని పరిచయం చేయడంతో పాటు కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. తొలుత, గీతం హైదరాబాద్ లో నెలకొల్పిన మల్టీడిసిప్లినరీ యూనిట్ ఆఫ్ రీసెర్చ్ ఆన్ ట్రాన్స్లేషనల్ ఇనిషియేటివ్స్ (MURTI)ని డాక్టర్ ఎల్లా ప్రారంభించారు. ఈ అత్యాధునిక పరిశోధనా కేంద్రం ఇంటర్ డిసిప్లినరీ పరిశోధనలను ప్రోత్సహించడం, ముఖ్యమైన ప్రాంతీయ, జాతీయ, ప్రపంచ సమస్యలను పరిష్కరించడం లక్ష్యంగా పెట్టుకుంది. శాస్త్రీయ ఆవిష్కరణలో ఆచరణాత్మక అనువర్తనాల ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ, పరిశ్రమ అవసరాలతో వారి ప్రాథమిక పరిశోధనా ప్రాజెక్టులను చేపట్టాలంటూ డాక్టర్ ఎల్లా గీతం పరిశోధకులను ప్రోత్సహించారు. గీతంను ఎంఐటీ వంటి ప్రఖ్యాత సంస్థలతో పోల్చిన డాక్టర్ ఎల్లా, గీతం వ్యవస్థాపకుల దార్శనిక నాయకత్వానికి గాను, డాక్టర్ ఎంవీవీఎస్ మూర్తి, ఆయన మనవడు ఎం.శ్రీభరత్ లకు ధన్యవాదాలు తెలిపారు.




## అమావాస్య అన్నప్రసాద వితరణలో పాల్గొన్న ఉప్పల

**ఎల్బీనగర్ ,విశాలభారతి :**

రంగారెడ్డి జిల్లా ఐవిఫ్ అధ్యక్షుడు చింతల రజినీకాంత్ గుప్త ఆధ్వర్యంలో ఎల్బీనగర్ ఆధ్వర్యంలో జరిగిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో తెలంగాణ ఆర్య సభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష అభ్యర్థి శ్యామ్ సుందర్ గుప్త తో కలిసి తెలంగాణ టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా పాల్గొనడం జరిగింది.ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల కన్న అన్నప్రసాద వితరణ కార్యక్రమం గొప్పది అని ఆయన అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ముందుముందు చాలా కొనసాగించాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో కూర నాగరాజు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.




## రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలి

- మంచాల పిఏసీఎస్ సీఈఓ మస్కూరి శ్రీనివాస్

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**

రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి తోడ్పడాలని మంచాల పిఏసీఎస్ సీఈఓ మస్కూరి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ రైతులు తీసుకున్న పంట రుణాలు ఏడాదిలోపు చెల్లిస్తే వడ్డీ తక్కువ ఉంటుందని ,ఏడాది గడువుదాటితే వడ్డీ ఎక్కువవుతుందని, దాని వల్ల రైతులకే నష్టం కలుగుతుందని సూచించారు. సక్రమంగా చెల్లించని వారికి తిరిగి రుణాలు ఇవ్వడం నిలిపివేస్తామన్నారు. సకాలంలో రుణాలు చెల్లించి సొసైటీ అభివృద్ధికి తోడ్పడాలని చెప్పారు.



## మేరు కులస్తులకు అండగా నిలుస్తా

- గూడెం మధుసూదన్ రెడ్డి

**పటాన్ చెరు,విశాలభారతి**




ప్రస్తుత పోటీ ప్రపంచంలో కులవృత్తిని నమ్ముకుని జీవిస్తున్న మేరు (దర్జీ) కులస్తులకు అండగా నిలుస్తామని సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి అన్నారు. టైలర్స్ డే పురస్కరించుకొని.. పటాన్ చెరు మండలం ఇంద్రేశం గ్రామ పరిధిలో దర్జీ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మేరు కులస్తుల కోసం గతంలో స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఇంద్రేశంలో సొంత నిధులతో 200 గజాల స్థలాన్ని కొనుగోలు చేసి అందించడం జరిగిందని గుర్తు చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులోను వారికి పెద్దపీట వేశారని తెలిపారు. భవిష్యత్తులోనూ వారికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు శంకర్ యాదవ్, సపాన దేవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, నర్రా బిక్షపతి, పృథ్వీరాజ్, చంద్రశేఖర్, అంతిరెడ్డి, చంద్రకుమార్, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



## శారదానగర్ లో అగ్ని ప్రమాదం

- గుర్తు తెలియని వ్యక్తులు చెత్తకు నిప్పంటించడంతో ప్రమాదం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి, కార్పొరేటర్ కళ్లెం నవరజీవన్ రెడ్డి

**పెద్దఅంబర్ పేట్, విశాలభారతి:**

హయత్ నగర్ డివిజన్ లోని శారదానగర్ లో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు చెత్తకు నిప్పంటించడంతో పక్కనే ఉన్నటువంటి ఎండిపోయిన చెట్లకు,గడ్డికి నిప్పు అంటుకోవడంతో పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. స్థానికుల నుండి సమాచారం రావడంతో అగ్నిమాపక సిబ్బంది మరియు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మంటలు అదుపు చేశారు. ప్రమాదంలో ఎటువంటి ప్రాణాపాయం లేకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవి రెడ్డి సుధీర్ రెడ్డి, హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ఘటన స్థలాన్ని పరిశీలించారు. వేసవికాలంలో ప్రజలు బహిరంగ ప్రదేశాలలో చెత్తా చెదారానికి నిప్పంటించటం లాంటివి చేయకూడదని, వేసవి కాలం లో చెట్లని ఎండిపోయి కొంచం నిప్పు అంటిన అది పెద్దగా మారే ప్రమాదం ఉందని, ప్రజలు వేసవి కాలం లో అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి,కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ప్రజలకు సూచించారు.



## పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**



పురుగు మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం యాచారం మండలంలోని గాండ్లగూడలో చోటుచేసుకుంది. సీఐ నందీశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గాండ్లగూడ గ్రామానికి చెందిన కోరే అంజయ్య (55) వృత్తిరీత్యా ఆర్టీసీ బస్ కండక్టర్ గా ఇబ్రహీంపట్నం డిపో లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా గురువారం సాయంత్రం గడ్డికి కొట్టే పురుగు మందు తాగి వ్యవసాయ బావి వద్ద పడిపోయాడు. గమనించిన అతని కుటుంబ సభ్యులు హుటాహుటిన హైదరాబాదులో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



## టెక్నో కల్చరల్ ఫెస్ట్ టెక్నోస్మానియా 2K25 పోస్టర్స్ ఆవిష్కరించిన ఓయూ వీసీ

**విశాలభారతి,ఓయూ:**

ఓయూ టెక్నాలజీ కళాశాలలో ఏప్రిల్ 23,24, 25 వ లాలో జరగనున్న టెక్నోస్మానియా 2k25 బ్రోచర్స్ , పోస్టర్స్ ను శుక్రవారం ఉస్మానియా విశ్వవిద్యాలయం వీసీ ప్రొ. కుమార్ మొలుగరం కళాశాల ప్రొపెసర్స్ ,నిర్వాహకులతో కలిసి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. జి. నరేష్ రెడ్డి, ఓఎస్డీ ప్రొ. జితేందర్ కుమార్ నాయక్, టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. వి.రమేష్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ , టెక్నాస్మానియా కన్వీనర్ ప్రొ. శ్రీను నాయక్, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్స్ డా. ఎ.అభిలాష్, డా.వి.భాస్కర్, డా.కె. శ్రీనివాసులు, డా.ఎస్. అనిత,డా.ఎ.పరశు రాములు, డా.సాదం. ఐలయ్య, స్టూడెంట్ కోఆర్డినేటర్స్ అయినాల వినయ్, ఎం. కవిచన్య రెడ్డి, యు.నంద కిషోర్, ఎం.స్ఫూర్తి, డి. వైష్ణవి,జి. భవిత, ఎం.శ్రీనివాస్ నివృతి పాల్గొన్నారు



# కండర క్షీణత వ్యాధి బాధితులకు నిత్యవసర సరుకులు పంపిణీ

- మంచి మనసు చాటుకున్న వెంకట కృష్ణారెడ్డి



**పటాన్ చెరు,విశాలభారతి**

కండర క్షీణత తీవ్ర వైతల్య బాధితులకు వెంకట కృష్ణారెడ్డి చేయూతనందించారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని నందిగామ రోడ్డు రామాలయం ఆవరణలో కండర క్షీణత వ్యాధి బాధితుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కృష్ణారెడ్డి సహకారంతో నిత్యవసరం అందించారు.1025కిలోల బియ్యం, 2 కిలోల కందిపప్పు, ఒక కిలో గోధుమపిండి, 5 లీటర్ల వంటనూనె, కారంపొడి 500 గ్రాములు, 11రకాలతో కూడిన ఒక్కొకరికి 3,500 రూపాయలు విలువ చేసే వివిధ 20 మంది కండర క్షిణత తీవ్ర వైకల్య బాధితులకు పంపిణీ చేశారు. తెలంగాణ మస్కులర్ డిస్ట్రోఫీ అసోసియేషన్ (టియండిఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మడపతి రవికుమార్ మాట్లాడుతూ గురు రాఘవేందర్ ద్వారా తెలుసుకొని పెద్ద మనసుతో స్పందించి సహాయం చేసిన వెంకట కృష్ణారెడ్డి, విజయ నిర్మల దంపతులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో షేర్ ఫౌండేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు మురళీ, మోహన్, శేఖర్, మూర్తి, గురు రాఘవేందర్, సామాజిక కార్యకర్త బాపు వెంకన్న, తదితరులు పాల్గొన్నారు

# నేడే మెగా జాబ్ మేళ

- 18 కి పైగా కంపెనీలు 4 వేలకు పైగా ఉద్యోగ అవకాశాలు
- జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**

ఎంఆర్ఆర్ యువసేన ఆధ్వర్యంలో నేడు మెగా జాబ్ మేళ నిర్వహిస్తున్నట్లు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తెలిపారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని నిరుద్యోగులు యువతి, యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బొంగులూరు సమీపంలోని ప్రమిద కన్వెన్షన్ హాల్ లో నేడు ఉదయం 10గంటల నుండి సాయంత్రం వరకు మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జాబ్ మేళాలో 18 కి పైగా కంపెనీలు 4 వేలకు పైగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్హత పది , ఇంటర్మీడియట్ , ఐటిఐ, గ్రాడ్యుయేట్స్ , పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. నిరుద్యోగులు యువతీ యువకులు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.



# వేసవికాలంలో వృద్ధులు, చిన్నపిల్లలు జాగ్రత్తలు తీసుకోవాలి

- మార్నింగ్ వాక్ లో భాగంగా కాలనీలో పర్యటించిన కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి శుక్రవారం మార్నింగ్ వాక్ లో భాగంగా డివిజన్లోని ఆటో సాయి నగర్, హైకోర్టు కాలనిలో పర్యటించి పారిశుద్ధ కార్మికుల విధి నిర్వహణ, కాలనీలో ఉన్నటువంటి సమస్యలను కాలనీ వాసులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వేసవికాలంలో వృద్ధులు, చిన్నపిల్లలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అదేవిధంగా కాలనీలో ఎలాంటి సమస్యలు ఉన్న వెంటనే తమకు సమాచారం అందించాలని కాలనీవాసులకి తెలిపారు.ఈ పర్యటనలో శానిటేషన్ సూపర్వైజర్లు వెంకట్ రెడ్డి, మధు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలమర్రి లో నేత్రపర్వంగా రథోత్సవం

**సూర్యాపేట,విశాలభారతి:**

సూర్యాపేట మున్సిపల్ పరిధిలోని పిల్లలమర్రి లో మహా శివరాత్రి వేడుకలలో భాగంగా నిర్వహించిన రథోత్సవం నేత్రాపర్వంగా జరిగింది. శుక్రవారం తెల్లారుజామున మహాదేవ నామేశ్వర స్వామి దేవాలయం నుండి ఏరకేశ్వరస్వామి దేవాలయం వరకు గ్రామ పురవీధుల్లో ఊరేగింపు చేశారు. ముందుగా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సంప్రదాయ బద్ధంగా స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను రథం పైకి తీసుకువచ్చారు. డప్పుల చప్పుళ్ళు, డిజె సౌండ్ సందడితో మహిళలు కొలాటలు చేస్తూ రథ సేవలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆలయ అర్చకులు మునగలేటి సంతోష్ శర్మ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటి చైర్మెన్ గవ్వ వెంకటకృష్ణరెడ్డి, డైరెక్టర్లు చిత్తలూరి సతీష్, చెరుకుపల్లి బుచ్చి రాములు, వల్లాల జానీ యాదవ్, నక్కల సైదులు, బట్టు నాగరాజు యాదవ్, చెరుకుపల్లి కృష్ణయ్య, మొగిలి ఎల్లయ్య, ఎర్రంశెట్టి వెంకటేష్, ఓబల్లోజు చంద్రశేఖర్, రాయల భారతమ్మ, చింత సునంద, షేక్ జానీ మియా గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

# ఘనంగా టైలర్స్ డే వేడుకలు



**ఆమనగల్లు,విశాలభారతి :**

ఆమనగల్ పట్టణంలో శుక్రవారం టైలర్స్ వేడుకలను టైలర్లు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టైలర్స్ డే సృష్టికర్త విలియన్స్ జయంతి వేడుకలు నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు, పండ్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు పాపిశెట్టి రాము, టైలర్స్ సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.





# టీపీసీసీ నూతన ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ను కలిసిన నీలం మధు..

- గాంధీభవన్ లో టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశం

**పటాన్ చెరు,విశాలభారతి:**

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ టీపీసీసీ నూతన ఇన్చార్జిగా నియమితులై బాధ్యతలు స్వీకరించిన మీనాక్షి నటరాజన్ ను మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటేస్టేడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం గాంధీ భవన్ లో జరిగిన టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో నీలం మధు పాల్గొని నూతన ఇంచార్జ్ ని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఢిల్లీ నుంచి రైలు లో హైదరాబాద్ చేరుకుని గాంధీభవన్ కు వచ్చిన ఆమెకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కార్పొరేషన్ చైర్మన్లు, పీసీసీ సభ్యులతో కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ ఏఐసీసీ నూతన ఇంచార్జిగా నియమితులైన మీనాక్షి నటరాజన్ నేతృత్వంలో తెలంగాణ లో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో యువతకు పెద్ద పీట వేస్తున్నారని తెలిపారు. పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి ఒకరికి కాంగ్రెస్ లో గుర్తింపు ఉంటుందనడానికి మీనాక్షి నటరాజన్ నియామకం ఉదాహరణగా ఆయన అభివర్ణించారు.



# యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

- మత్తుకు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దు
- ఇబ్రహీంపట్నం ఏసిపి కేపివి రాజు

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి :**

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మత్తుకు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని ఇబ్రహీంపట్నం ఏసిపి కేపివి రాజు పేర్కొన్నారు. మండలంలోని తూలేకలన్ (పెత్తుల్ల) గ్రామంలో శుక్రవారం యువతకు, మహిళలకు అన్లైన్ గేమ్స్ ,డ్రగ్స్ , గంజాయి , చైన్ స్నాచింగ్ పైన అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసిపి రాజు మాట్లాడుతూ ప్రభుత్వం మాదకద్రవ్యాల అక్రమ రవాణా మరియు దుర్వినియోగంపై చేస్తున్న పోరాటంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. మత్తుతో జీవితాలు చిత్తు చేసుకోవద్దని, మాదక ద్రవ్యాల నిర్మూలన మన అందరి బాధ్యత అన్నారు. యువత డ్రగ్స్, మాదక ద్రవ్యాలకు అలవాటు పడడం వల్ల దైనందిన విషయాలపై దృష్టి పెట్టకుండా క్రమేపీ ఆరోగ్యం క్షీణించడంతో పాటు అది ఒక వ్యసనంగా మారి, నేర ప్రవృత్తి వైపు దారి తీస్తుందన్న విషయం ప్రతీ ఒక్కరు గమనించాలన్నారు. డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు చేసే ఎలాంటి వ్యక్తుల సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం సీఐ జగదీశ్వర్ రెడ్డి,ఎస్ఐ రామకృష్ణ , గ్రామ యువకులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# మహిళా జర్నలిస్ట్‌కు రూ.14వేల ఆర్థిక సహాయం

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా అందజేత

**కాప్రా,విశాలభారతి:**

సహచర మహిళా జర్నలిస్ట్ మమత తండ్రి కన్నయ్య ఇస్తారి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు.తోటి విలేకరులు వారికి తోచిన మేరకు మృతిని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. శుక్రవారం మృతుని కుటుంబ సభ్యులు మమతను మౌలాలి హౌసింగ్ బోర్డ్ కాలనీ రాజీవ్ నగర్ లో స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్ విలేకరులతో కలసి పరామర్శించి రూ.14 వేల ఆర్థిక సహాయం అందజేశారు.మృతుని కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జర్నలిస్టులలో ఒక్కరికి కష్టం వచ్చినప్పుడు ప్రతి ఒక్కరు ఐక్యతగా ముందుకు వెళ్లడం ఒకరికొకరు సాయం చేసుకోవడం అభినందనీయమన్నారు. ఆర్థిక సహాయం అందజేతలో కాప్రా ప్రెస్ క్లబ్బులకు సంబందించిన సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు పటేల్ నర్సింహులు యాదవ్,దొమ్మటి కిరణ్ కుమార్, గుమ్మడి రోజరాణి,బెల్దే అశోక్, ఏంపల్లి పద్మారెడ్డి, వెంకట్, రామచంద్ర మూర్తి,గంగి కృష్ణ,ముత్యం ముకేశ్ గౌడ్,జి. శ్రీనివాస్ రావు,గుమ్మడి హరిప్రసాద్,నిరంత్ గౌడ్,కిర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యక్తి అదృశ్యం



**పెద్ద అంబర్ పేట్,విశాలభారతి:**

మునగనూరుకి చెందిన కోరగంజి సుధీర్ కుమార్ (31) ఈనెల 13న నుండి కనబడటం లేదని సుధీర్ కుమార్ చెల్లి కోరగంజి సంధ్యారాణి హయత్ నగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. పిర్యాదు మేరకు ఇన్స్పెక్టర్ నాగరాజు గౌడ్ మాట్లాడుతూ... వివరాల ప్రకారం ఈనెల 13న సాయంత్రం ఏడు గంటల సమయంలో సుధీర్ కుమార్ కుటుంబ సభ్యులతో గొడవ పెట్టుకుని ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. గతంలో కూడా ఇలానే వెళ్లి కొద్ది రోజులకు తిరిగి వచ్చేవాడు. ఇప్పుడు కూడా అలాగే తిరిగి వస్తాడు అని ఇన్ని రోజులు వేచి చూసినా సుధీర్ కుమార్ తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల, తెలిసిన బంధువుల దగ్గర వెతికినా కూడా ఎటువంటి ఆచూకీ లభించకపోవడంతో సుధీర్ కుమార్ చెల్లెలు కోరగంజి సంధ్యారాణి ఫిర్యాదు చేశారు. ఆమె పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని హయత్ నగర్ సిఐ నాగరాజు గౌడ్, అడ్మిన్ ఎస్ఐ కే.వెంకట్ రెడ్డి తెలియజేశారు.



# వెల్కమ్ మేడం..

- మీనాక్షి నటరాజన్ కు'కాట' శుభాకాంక్షలు
- టిపిసిసి విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న కాట శ్రీనివాస్ గౌడ్

**పటాన్ చెరు,విశాలభారతి:**

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కొత్త ఇంచార్జిగా బాధ్యతలు స్వీకరించిన మీనాక్షి నటరాజన్ కు కాంగ్రెస్ పార్టీ పటాన్ చెరు నియోజకవర్గం ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయం గాంధీ భవన్ లో శుక్రవారం టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన టీపీసీసీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశంలో కాట శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జిగా నియమితులై, బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మీనాక్షి నటరాజన్ ను కాట శ్రీనివాస్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీపీసీసీ నూతన ఇంచార్జి నియమితులైన మీనాక్షి నటరాజన్ రాజకీయాల్లో సుధీర్ఘ చరిత్ర ఉన్న నాయకురాలని తెలిపారు. ఎన్ఎస్ యుఐ నాయకురాలిగా కెరీర్ ప్రారంభించిన మీనాక్షి నటరాజన్ కాంగ్రెస్ పార్టీలో వివిధ పదవులను నిర్వహించారని చెప్పారు. మీనాక్షి నటరాజన్ నాయకత్వంలో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని కాట శ్రీనివాస్ గౌడ్ విశ్వాసం వ్యక్తం చేశారు.



vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

శనివారం,
01.03.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com






## ఇంటర్మీడియట్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- రంగారెడ్డి జిల్లాలో 185 పరీక్షా కేంద్రాలు
- పరీక్షలు రాయనున్న 1,47,211 మంది విద్యార్థులు
- వివరాలు తెలిపిన డిఆర్ఓ సంగీత

ఇబ్రహీంపట్నం,విశాలభారతి: ఈ నెల 5 నుండి ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే ఇంటర్మీడియట్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు రంగారెడ్డి డిఆర్ఓ సంగీత తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో 185 పరీక్షా కేంద్రాల ద్వారా 77,863 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు, 69,348 మంది రెండవ సంవత్సరం విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని, 31 ప్రశ్న పత్రాల స్టోరేజ్ పాయింట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లు, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్, పరీక్షా సమయంలో జీరాక్స్ సెంటర్లు మూసి వేసేలా చర్యలు చేపడతామని తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు హాజరయ్యేలా ఆర్టీసీ అధికారులు బస్సులను నడపేలా, పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులతో మెడికల్ పాయింట్ ఏర్పాటు చేసి సిబ్బంది కేంద్రాల వద్ద అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఈ సమావేశంలో కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత రెడ్డి, చేవెళ్ళ ఆర్డీఓ చంద్రకళ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంక్యా నాయక్, విద్యాశాఖ అధికారి సుశిందర్ రావు, రాచకొండ పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఆర్టీసీనీ ప్రభుత్వంలో విలీనం చేసి ఆదుకోవాలి

- తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డికి వినతి పత్రం అందజేసిన
- తెలంగాణ మజ్దూర్ యూనియన్ నాయకులు

సూర్యాపేట, విశాలభారతి: రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుంకరి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి నివాసంలో ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రమేష్ రెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గత ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తానని ప్రకటన చేసిన నేటికీ అమలులోకి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ యాజమాన్యం ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకపోకుండా అడ్డుకుంటుందని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల వేతన సవరణ బకాయిలు పెండింగ్ లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. గత 13 ఏళ్లుగా ఆర్టీసీలోఉన్న ఖాళీలను భర్తీ చేయడం లేదని, దీని మూలంగా ఉద్యోగులపై పనిభారం అధికంగా పడుతుందన్నారు. తక్కువ వేతనాలతో విధులు నిర్వహిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకుపోవడంలో తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మజ్దూర్ యూనియన్ సభ్యులు మాచర్ల భాస్కర్, ఏకాంబరం, నాయనీ విద్యాసాగర్ పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు చెల్లించకుంటే పోరుబాట


### పాడి రైతులు



ఆమనగల్లు,విశాలభారతి: విజయ డైరీ రైతులకు పెండింగ్ పాల బిల్లులు చెల్లించకుంటే పోరుబాట కార్యక్రమం చేపడతామని పాడి రైతులు చెప్పారు. శుక్రవారం కడ్తాల్లో వారు మాట్లాడుతూ..రెండున్నర నెలలుగా పాల బిల్లులు రాక తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విషయాన్ని విజయ డైరీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేదని వాపోయారు.మార్చి 5వ తేదీలోగా చెల్లించకుంటే పాదయాత్ర చేపడతామన్నారు. రైతులు రామకృష్ణ,మహేశ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల యువకుడికి ఓయూ డాక్టరేట్

- భూకంపాలను ముందుగానే గుర్తించే విధానంపై అధ్యయనం
- ఎస్కేఎన్ఆర్ కాలేజీలో డిగ్రీ పూర్తి చేసిన డా. అనుమల్ల శ్రీధర్






హైదరాబాద్, విశాలభారతి: భూకంపాలను ముందుగానే గుర్తించి, నియంత్రణ చర్యలకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేసినందుకు జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన అనుమల్ల శ్రీధర్‌కు దేశంలోనే ప్రముఖ విద్యాసంస్థ అయినా ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఉస్మానియా యూనివర్సిటీలో జియోఫిజిక్స్‌లో పీజీ పూర్తి చేసి, ప్రొ. రామరాజ్ మాథుర్ మార్గదర్శకత్వంలో రీసెర్చ్ స్కాలర్‌గా భూకంపాల గుర్తింపునకు ఆధునాతన పద్ధతులు, విపత్తు నిర్వహణ సంసిద్ధత వ్యూహాలను మరింత బలోపేతం చేయడంపై శ్రీధర్ అధ్యయనం చేశారు. దేశంలోని "దక్షిణ అండమాన్‌లోని పోర్ట్ బ్లెయిర్‌లో షాలో యాక్టివ్ ఫాల్ట్ సిగ్నేచర్‌లను గుర్తించే రిమోట్ సెన్సింగ్ జియోఫిజికల్ టెక్నిక్స్" అనే అంశంపై లోతైన పరిశోధన చేశారు. భూకంపాలు రాక ముందే గుర్తించడమే ఈ అధ్యయనం లక్ష్యం కాగా, పోర్ట్ బ్లెయిర్ భూకంపం తర్వాత అధునాతన ఫాల్ట్ డిటెక్షన్ పద్ధతుల అవసరాన్ని తన పరిశోధన ద్వారా చాటి చెప్పారు. జియోలాజికల్ సర్వే కోసం అయస్కాంత, విద్యుదయస్కాంత పరికరాలను ఉపయోగించి సరికొత్త విధానానికి రూపకల్పన చేయగా, దీనిద్వారా భూకంప అంచనా, విపత్తుల నిర్వహణకు అవసరమైన సమాచారాన్ని సేకరించే వీలు కలిగింది. తన అధ్యయనం ద్వారా ప్రభుత్వ సంస్థలు విపత్తు నిర్వహణ బృందాలను ముందుగానే అప్రమత్తం చేసే అవకాశం ఉంటుందని, అదేవిధంగా ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను సంసిద్ధత వ్యూహాలను మెరుగుపరచడానికి కచ్చితమైన సమాచారంతో సన్నద్ధం చేయడానికి తోడ్పడతుందని శ్రీధర్ పేర్కొన్నారు. ఈ అధ్యయనం కోసం భౌగోళిక ప్రక్రియలు, ఊహించని సహజ దృగ్విషయాల యొక్క విస్తృత అవగాహనను పెంచేందుకు భౌగోళిక భౌతిక శాస్త్రంలో భవిష్యత్ పురోగతికి మార్గం సుగమం చేస్తుందన్నారు.

**జియోఫిజిక్స్‌పై మక్కువతో...**

భూగర్భంలో జరిగే అంతు చిక్కని రహస్యాలను తెలుసుకోవాలనే జిజ్ఞాసతో మొదలైన శ్రీధర్ ప్రయాణం... అదే విభాగంలో డాక్టరేట్ పొందే వరకు సాగింది. ఆయన ఆసక్తిని గమనించి ప్రొ. రామరాజ్ మాథూర్ ప్రోత్సాహించడంతో ప్రకృతి విపత్తులకు సమర్థవంతంగా సన్నద్ధమయ్యే అవకాశం కల్పించే ఆధునాతన విధానానికి శ్రీధర్ రూపకల్పన చేసే స్థాయికి ఎదిగారు. శాస్త్రీయ అధ్యయనంపై మక్కువతో ఉస్మానియా యూనివర్సిటీలో స్కాలర్ గా చేరి ఎనిమిది జాతీయ, అంతర్జాతీయ పరిశోధన జర్నల్‌కు తన పరిశోధన అనుభవాలను పంచుకున్నారు. అదే విధంగా మరో ఐదు ఎడ్యుకేషన్ సెమినార్‌ల్లో పాల్గొని ప్రతిభ కనబర్చారు. ఈ రంగంలో తన నైపుణ్యాలను ప్రదర్శించి రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు.

**ఎస్కేఎన్ఆర్ డిగ్రీ కాలేజీ విద్యార్థే...**

అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉన్న ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందిన శ్రీధర్ జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎస్కేఎన్ఆర్ డిగ్రీ పీజీ కాలేజీలో చదివారు. అనంతరం ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ కాలేజీలో జియోఫిజిక్స్ విభాగంలో చేరారు. ఆ తర్వాత నిర్వహించిన పీహెచ్‌డీ ఎంట్రెన్స్ ద్వారా ఉస్మానియా యూనివర్సిటీలోనే రీసెర్చ్ స్కాలర్‌గా చేరి ప్రపంచవ్యాప్తంగా ప్రకృతి విపత్తుల నిర్వహణ సవాళ్లను అధిగమించే నూతన విధానంపై అధ్యయనం చేశారు. తన పరిశోధనతో ముఖ్యంగా భూకంపాల విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొని ప్రాణ , ఆస్తి నష్టాన్ని తగ్గించుకునేందుకు దోహదపడుతుందనీ, మరిన్ని ఆధునాతన విధానాలను ఆవిష్కరించేందుకు బాటలు వేస్తుండటం గర్వంగా ఉందన్నారు. కాగా శ్రీధర్ అత్యున్నత ప్రతిభతో డాక్టరేట్ పొందడంపై ఓయూ విభాగం బోధన సిబ్బందితోపాటు, జగిత్యాల జిల్లా కేంద్రంలోని పలువురు హర్షం వ్యక్తం చేశారు.






## కెన్యా నెడాక్ సదస్సులో ముల్కనూర్ సొసైటీ అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి

- కెన్యా మోడల్ ఆఫ్ కో-ఆపరేటివ్స్ అండ్ అగ్రికల్చరల్ సిస్టమ్స్ విజిట్
- ముల్కనూర్ సొసైటీ డెవలప్మెంట్ గూర్చి పవర్ పాయింట్ ప్రజెంటేషన్

విశాలభారతి,భీమదేవరపల్లి : ములుకనూరు సహకార సంఘ అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి కెన్యాలోని మొంబాసా నగరంలో నిర్వహిస్తున్న నెడాక్ జనరల్ అసెంబ్లీ, ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం 2025 లో శుక్రవారం పాల్గొన్నారు. ఈ సమావేశంలో "అండర్‌స్టాండింగ్ ది కెన్యా మోడల్ ఆఫ్ కో ఆపరేటివ్స్ అండ్ అగ్రికల్చరల్ సిస్టమ్స్ స్టడీ విజిట్ కొరకు పర్యటించారు. ఆసియా పసిఫిక్ దేశాల వ్యవసాయ సహకార సంఘాల అభివృద్ధి నెట్వర్క్ సమావేశం ఫిబ్రవరి 24 నుండి 28 వరకు నిర్వహించబడుతుంది. ఈ సమావేశంలో నెడాక్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొని పరస్పర సహకారం, జ్ఞానం సహకార రంగంలో ప్రగతి శీలత ప్రోత్సహించడానికి సమావేశం ఏర్పాటు చేశారు.

**ముల్కనూర్ సొసైటీ సక్సెస్ గూర్చి పవర్ పాయింట్ ప్రజెంటేషన్**

ఈ సమావేశంలో ముల్కనూర్ సహకార సంఘ అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి సంఘ కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. స్టడీ టూర్ లో భాగంగా "అండర్ స్టాండింగ్ ది కెన్యా మోడల్ ఆఫ్ కో ఆపరేటివ్ అండ్ అగ్రికల్చరల్ సిస్టమ్స్" అంశంపై కెన్యాలో విజయవంతమైన సహకార సంఘాలు క్రెడిట్ సహకార సంఘాల చేత నిర్వహించబడుతున్న వినూత్న వ్యూహాలు సభ్యుల ఓటింగ్ తో కీలక నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలను పరిశీలించారు. ఈ సమావేశంలో ఎన్సీడీసీ మేనేజింగ్ డైరెక్టర్ చైర్మన్ పంకజ్ కుమార్ బన్సాల్ ఇఫ్కో చైర్మన్ దిలీప్ సంఘాని పాల్గొన్నారు.



## టైలర్స్ ను ప్రభుత్వం ఆదుకోవాలి

- పట్టణ క్లాత్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు గండూరి కృపాకర్

సూర్యాపేట, విశాలభారతి: టైలరింగ్ వృత్తి లో జీవిస్తున్న వారిని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని పట్టణ క్లాత్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు, జిల్లా బిఆర్ఎస్ నాయకులు గండూరి కృపాకర్ తెలిపారు. శుక్రవారం డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్ జయంతి టైలర్స్ డే సందర్భంగా సూర్యాపేట లేడీస్ టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు ,వారి బంధువులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న వారు మాట్లాడుతూ టైలర్స్ కు, క్లాత్ మర్చంట్ వ్యాపారస్తులకు, అవినాభవ సంబంధాలు ఉంటాయని వారికి ఏ ఆపద వచ్చినా మా క్లాత్ మర్చంట్ అసోసియేషన్ ఎల్లప్పుడు సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం వృద్ధాప్యంలో ఉన్న టైలర్స్ కు పెన్షన్ తో పాటు, ఉచిత ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలన్నారు. క్షవర వృత్తి వారికి ప్రభుత్వం ఉచితంగా విద్యుత్తు అందించినట్టుగానే టైలరింగ్ వృత్తిలో ఉన్న వారికి కూడా ఉచిత విద్యుత్ అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆపదలో ఉన్న వారికి మా పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని, టైలర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుక వెళ్లి పరిష్కరించడానికి నా వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో లేడీస్ టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు బోనగిరి చంద్రకళ, ప్రధాన కార్యదర్శి మొక్క రామాంజనేయులు గౌడ్ కోశాధికారి కోణం చంద్రశేఖర్, చనగాని అంజమ్మ, నాయకులు దూలం నగేష్, మేక సంపత్, వల్దాసు జగదీష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

శనివారం,
01.03.2025
హైదరాబాద్
epaper:vishalabharathi.com
www.vishalabharathi.com



## ప్రజల చెంతకే పల్లె పల్లె దావాఖానలు

**తొర్రూరు, విశాలభారతి:**

పల్లె దవాఖానాల్లో ప్రజల చెంతకే వైద్యం అందుబాటులోకి వచ్చిందని వెలికట్ట పల్లె దవాఖాన వైద్యురాలు డాక్టర్ ఫాతిమా ఫరా తెలిపారు. తొర్రూరు మండలంలోని వెలికట్ట పల్లె దవాఖానలో 12 రకాల వైద్య సేవలపై వైద్యురాలు ఫాతిమా స్థానికులకు అవగాహన కల్పించారు. స్థానికులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఔషధాలు, మందులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పల్లె దవాఖానాల్లో 12 రకాల వైద్య సేవలు ప్రజలకు అందుతున్నాయని తెలిపారు. ప్రతి ఉప కేంద్రాన్ని పల్లె దవాఖానాగా మార్చడం వల్ల ప్రభుత్వం వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. గర్భిణీలు, పిల్లలకు బుధ, శనివారాల్లో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారని, బిపి, షుగర్ ఇక్కడే పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తారన్నారు.



## అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినోత్సవం

- మార్చి 1 నుండి 8 వరకు గ్రామ గ్రామాన జరపండి.
- పిఓడబ్ల్యు పిలుపు

**సూర్యాపేట, విశాలభారతి:**

హైదరాబాద్ కేంద్రంగా 72వ ప్రపంచ అందాల పోటీలను నిర్వహించడంను ప్రగతిశీల మహిళా సంఘం( పిఓడబ్ల్యూ) వ్యతిరేకిస్తుందని, వాటిని అడ్డుకుంటామని పిఓడబ్ల్యూ సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల నర్సమ్మ అన్నారు. శుక్రవారం స్థానిక చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ సమాజంలో ఇంటా బయట మహిళా శక్తికి మించి శ్రమిస్తున్న వారి పట్ల అంతులేని వివక్ష, అణిచివేత కొనసాగుతున్నదని అన్నారు. కులాంతర, మతాంతర వివాహాలు చేసుకుంటున్న వారిపై ముఖ్యంగా దళితుల పై హింసాత్మక దాడులు, పరువు హత్యలు జరిగాయన్నారు. వీటిపై మహిళలు పెద్ద ఎత్తున ఉద్యమిస్తున్న అంతకంతపు లైంగిక హింస పెరుగుతుందని అన్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం మహిళా శక్తి గురించి గొప్పలు చెబుతున్న ఆచరణలో మహిళపై జరుగుతున్న హింసను అరికట్టడంలో వైఫల్యం చెందారని అన్నారు. మార్చి ఒకటి నుండి 8 వరకు జరిగే అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినోత్సవం ను జరపాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పి ఓ డబ్ల్యు జిల్లా ఉపాధ్యక్షురాలు రామలింగక్క, జిల్లా కమిటీ సభ్యులు సైదమ్మ, సామ ఉపేంద్ర ,జి .కావ్య, మంగమ్మ, జయసుధ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

**నర్సింహులు పేట, విశాలభారతి:**



మండలంలోని పెద్ద నాగారం జడ్పీ హెచ్ ఎస్ పాఠశాల యందు నేషనల్ సైన్స్ డే ను ఘనంగా నిర్వహించుకోవడం జరిగినది. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జానకి సుమన అధ్యక్షతన సైన్స్ ఉపాధ్యాయులు భూక్యా నాగేష్ నాయక్ , కొండ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులచే సైన్స్ సంబరాలు నిర్వహించుకున్నారు. సైన్స్ డే లో భాగంగా విద్యార్థిని ,విద్యార్థులు తయారుచేసిన సుమారు 20 ఎగ్జిబిట్లను ప్రదర్శించడం జరిగినది. డ్రాయింగ్ , వ్యాస రచన , రంగోలి , క్విజ్ , సైన్స్ సెమినార్ తదితర కార్యక్రమాలు నిర్వహించుకున్నారు.వీటిలో ప్రథమ , ద్వితీయ స్థానాలు పొందిన విద్యార్థినీ విద్యార్థులను ఉపాధ్యాయ బృందం బహుమతులతో ప్రోత్సహించడం జరిగినది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జానకి సుమన మాట్లాడుతూ విద్యార్థుల దశ నుండే సైన్స్ పట్ల ఆసక్తి పొంది , శాస్త్ర సాంకేతికాల వైపుకు, పరిశోధనాల వైపు అడుగు పెట్టాలని విద్యార్థులను తెలియపరిచారు . సైన్స్ లేనిది మానవ మనుగడ సాగదని , సైన్స్ తోనే సంపూర్ణమైన సాంకేతికమైన దేశం తయారవుతుందని సీనియర్ సైన్సు ఉపాధ్యాయులు భూక్యా నాగేష్ నాయక్ కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల స్టాఫ్ సెక్రటరీ బి .లచ్చు, సీనియర్ ఉపాధ్యాయులు డి. సికిందర్ మరియు ఉపాధ్యాయ బృందం నాగేష్ ,నరసింహారెడ్డి , నామ వెంకటేశ్వర్లు , రాజు , బాల వేణు , మహేశ్వరి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## కర్షకుల క"న్నీరు"తో నీరు వదలాలని వినతి పత్రం

- ధర్మసాగర్ రిజర్వాయర్ నార్త్ కెనాల్ నీరు విడుదల చేయాలని రైతుల వినతిపత్రం

**విశాలభారతి,భీమదేవరపల్లి :**

ఆరుగాలం కష్టించి వేసిన పంట చేతికొచ్చే దశలో ఎండిపోవడంతో కర్షకుడి కంట కన్నీరు కారుతున్నది. గత పదేండ్లుగా పుట్లకొద్ది వడ్లు పండించిన భూములు నెర్రెలు బారి, పంట ఎండిపోవడంతో కర్షకులు కన్నీరు పెడుతున్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి, కొప్పూరు గ్రామాల రైతులు ధర్మసాగర్ రిజర్వాయర్ నార్త్ కెనాల్ నీటిని విడుదల చేయాలని అధికారులకు వినతిపత్రం సమర్పించారు. మండలంలో వర్షాలు లేక బోర్లలో నీరు అడిగింటిపోయి, త్రాగునీరుకు సైతం గ్రామ ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయ పంటలు పెట్టుకున్న రైతులకు నీటి కొరత తప్పడం లేదని, గ్రామాల్లో రైతుల ఇబ్బందులను గుర్తించి అధికారులు కెనాల్ నీరు వదలాలని పలువురు రైతులు కోరుతున్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో గద్ద కుమారస్వామి, జనగాని సమ్మయ్య, మీస మహేష్, పెట్టం కుమారస్వామి, కస్తూరి జంపయ్య తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ సైన్స్ దినోత్సవం

**బాల్కొండ,విశాలభారతి:**

భీమ్‌గల్ పట్టణ కేంద్రంలోని సరస్వతీ విద్యా మందిర్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించరు.ఈ సైన్స్ దినోత్సవ కార్యక్రమంలో 4వ తరగతి నుండి 9వ తరగతి విద్యార్థులు స్వయంగా యాభైకి పైగా ప్రాజెక్టులను తయారుచేసి ఉపాధ్యాయులను ఆకట్టుకున్నారు. పాఠశాల అధ్యక్షుడు డాక్టర్ జి.బసంత్ రెడ్డి విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను పరిశీలించి వాటి ఆవశ్యకత గురించి విద్యార్థులని అడిగి తెలుసుకున్నారు. జాతీయ సైన్స్ ఫెయిర్లో ప్రాజెక్టులను ప్రదర్శించిన విద్యార్థులందరికీ బహుమతులను అందజేశారు. అలాగే ఉత్తమ ప్రాజెక్టులను తయారు చేసిన విద్యార్థులకు మెమొంటో జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాస రవికుమార్,అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జి.నర్సారెడ్డి,సైన్స్ ఫెయిర్ ఇంచార్జ్ బి.స్వర్ణ,సైన్స్ ఉపాధ్యాయులు ఆర్ రవికుమార్, డి.శ్రీనివాస్,వై.వినోద్ కుమార్, జి.హారిక,ఎం.నవనీత, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.



## జిల్లా ఎంపిడిఓల సంఘం కార్యవర్గ ఎన్నిక

- అధ్యక్షుడుగా గంగుల సంతోష్ కుమార్

**బాల్కొండ,విశాలభారతి:**

నిజామాబాద్ జిల్లా ఎంపిడిఓల సంఘం జిల్లా అధ్యక్షుడుగా భీమ్‌గల్ ఎంపిడిఓ గంగుల సంతోష్ కుమార్ ను కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ సిఈఓ,ఎన్నికల అధికారి సాయ గౌడ్ ఆధ్వర్యంలో డిఆర్డిఓ కార్యాలయంలో ఎంపిడిఓలు సమావేశంమై నిజామాబాద్ జిల్లా 20252027 సంవత్సరానికి నూతన జిల్లా కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షుడుగా గంగుల సంతోష్ కుమార్,ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస రావు,కోశాధికారిగా రాం నారాయణ,ఉపాధ్యక్షులుగా నీలవతి, రాములు నాయక్, జాయింట్ సెక్రటరీ గా వెంకటేశ్వర్లు,ఆర్గనైజింగ్ సెక్రటరీ గా నాగ్ నాథ్,పబ్లిసిటీ సెక్రటరీ గా సతీష్ కుమార్,ఎగ్జిక్యూటివ్ మెంబర్లు గా బాల కిషన్,శంకర్, తిరుమల,రాజా శ్రీనివాస్ లు ఎన్నికయ్యారు.




## దాట్ల ప్రాథమిక పాఠశాలలో ఘనంగా సైన్స్ డే

**తొర్రూరు, విశాలభారతి:**

దంతాలపల్లి మండలం లోని దాట్ల ప్రాథమిక పాఠశాలలో సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో భాగంగా సర్ సివి రామన్ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించడం జరిగింది . ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్కే ఆశ మాట్లాడుతూ తార్కిక ఆలోచన పెంపొందించుకోవడం ద్వారా విద్యార్థులు విద్యార్థులు పరిశోధన చేయుటకు ప్రేరణ కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు చింతల సురేష్ మాట్లాడుతూ దాట్ల ప్రాథమిక పాఠశాలలో సైన్స్ దినోత్సవ వేడుకలు 1928 ఫిబ్రవరి 28న రామన్ ఎఫెక్ట్ ప్రభావాన్ని కనుగొన్నందుకు ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28న సైన్స్ దినోత్సవం జరుపుకోవడం ఎంతో స్ఫూర్తిదాయకామని పిల్లలకు వివరించడం జరిగింది, ఇలాంటి సైన్స్ డే కార్యక్రమాలు పాఠశాలలో జరపడం అభినందనీయమని, ఇలాంటి కార్యక్రమాలు చేయడం వల్ల విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందుతుందని, తన చుట్టూ ఉన్న పరిసరాలను విద్యార్థులు నిశితంగా పరిశీలిస్తారని, మూఢనమ్మకాలపై అవగాహన పొందుతారని , విద్యార్థులు శాస్త్రీ ఆలోచన పెంపొందుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు సైన్స్ కు సంబంధించిన జీర్ణ వ్యవస్థ,శ్వాస వ్యవస్థ, జల చక్రం,జంతువుల జీవన విధానం,ఆహార పిరమిడ్ కార్బన్డయాక్సైడ్ వాయువును గుర్తించడం వంటి ప్రాజెక్ట్స్ చేశారు.



## ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్

**ఆమనగల్లు,విశాలభారతి :**

లిటిల్ స్కాలర్స్ టెక్నో స్కూల్లో సైన్స్ ఫెయిర్ ఆర్సన్ క్రాఫ్ట్స్ నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమనగల్లు ఎంఈఓ పాండు హాజరై సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభించారు.ఈ సైన్స్ ఎగ్జిబిషన్లో 90 పైగా ఎగ్జిబిట్స్ ప్రదర్శించారు సుమారు 250 మంది విద్యార్థులు యువ శాస్త్రవేత్తలుగా పాల్గొన్నారు. ఇందులో గుండె పనితీరు, రోబో, నాడి వ్యవస్థ పనితీరు, పొగ త్రాగడం వల్ల ఊపిరితిత్తులకు జరిగే నష్టం, ఎటిఎం , వ్యవసాయ క్షేత్రం, jCB, అయోధ్య రామ మందిరం, బొమ్మల కొలువు, వివిధ పండుగల ప్రాధాన్యత, వివిధ భాషల వ్యాకరణం ,గణిత సూత్రాలు, సోలార్ సిస్టం, పర్యావరణ వ్యవస్థ వ్యవస్థ, అగ్నిపర్వతాల విస్ఫోటనం, జల విద్యుత్ శక్తి, జామెట్రికల్ సిటీ, పోతురాజులు బోనాలు మొదలైన ప్రాజెక్టులతో విద్యార్థులు చాలా చక్కని భాషతో వివరించి సందర్శకులను అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ చుక్కా అల్లాజీ గౌడ్,అకడమిక్ ఎడ్వైజర్ సుదర్శన్ రెడ్డి, కరస్పాండెంట్ సుజాత రెడ్డి, డైరెక్టర్ సావిత్రి, ప్రిన్సిపల్ చెన్నయ్య గౌడ్, అలాగే ట్రస్మ డిస్ట్రిక్ట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అవ్వారి శివలింగం, వైస్ ప్రెసిడెంట్ సుధీర్ రెడ్డి, డివిజన్ సెక్రెటరీ శ్రీరామ్, గోలి శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు వెంకటేశ్వర శర్మ, యాదయ్య, శ్రీశైలం, హైమావతి, శ్రీ జన్య, మమత, నవ్య, దీప్తి, మౌనిక, తేజ, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.





## నాగార్జున స్కూల్లో ఘనంగా జాతీయ సైన్స్ డే వేడుకలు

- విద్యార్థులచే వివిధ రకాల ప్రయోగాత్మక ప్రదర్శనలు
- ఆకట్టుకున్న భూతల దీవి ప్రదర్శన

**నూతనకల్, విశాలభారతి:**

మండల కేంద్రంలోని నాగార్జున ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ డే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు సైన్స్ ప్రయోగాత్మక పాఠవాలను స్వయంగా తయారు చేసి వాటి వివరణను,ప్రాముఖ్యతను తెలియజేశారు. జంతు ప్రపంచ ప్రదర్శన,జంతు వర్గీకరణ, మొక్కల పెరుగుదల లాభాలు, న్యూట్రన్ ఫార్ములాస్,ఆహారం ఔషధం,ఆహార ఔషధాల ప్రదర్శన, ఫ్లెమింగ్ హ్యాండ్,చంద్రయాన్3, పర్యావరణం పరిరక్షణ,కాలుష్యం నివారణ,వివిధ రకాల సైన్స్ సూత్రాల సంబంధిత పాఠవాల ప్రదర్శనతో పాటు భారతదేశ వివిధ రాష్ట్రాల సాంప్రదాయ దుస్తుల ప్రదర్శనను ప్రదర్శించారు.ఈ ప్రదర్శన చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది.అది యేగాక విద్యార్థులు అత్యంత అద్భుతంగా నిర్మించిన భూతల దీవి ప్రదర్శన అందరిని అలరించగా అది తయారు చేసిన విద్యార్థులను పాఠశాలకు విచ్చేసిన అతిధులు అభినందించారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మారగాని వెంకట్ గౌడ్ మాట్లాడుతూ దేశం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలన్నా, సాంకేతిక పరంగా ప్రగతిని సాధించాలన్నా సైన్స్ అవసరం చాలా ఉందని అన్నారు. విద్యార్థులకు సైన్స్ పై అభిరుచిని, అభివృద్ధిని పెంపొందించడం కొరకే ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మారగాని విజయలక్ష్మి, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు గుర్రం యాదగిరి గౌడ్,బిక్కీ రామన్న,మహమ్మద్ మథిన్, దగ్గుల యశ్వంత్, రమేష్,సౌమ్య, రాజేశ్వరి,ప్రియాంక,నవ్య,మౌనిక, సునీత,ప్రియాంక,హేమలత, పావని,విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## నీటి సమస్య లేకుండా చూడాలి

- మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్

**బాల్కొండ,విశాలభారతి:**



సిడిఎంఎ,జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు భీమ్‌గల్ పట్టణంలో శుక్రవారం భీమ్‌గల్ మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ రానున్న వేసవికాలం దృష్ట్యా పట్టణంలో ఎక్కడ కూడా వాటర్ సమస్య లేకుండా చూడాలని ఏఈని,వాటర్ మ్యాన్ లను ఆదేశించారు.అలాగే పైపులైన్ లీకేజీ లేకుండా చూడాలని అన్నారు.లీకేజీలు ఏర్పడిన వెంటనే వాటిని చేయాలని ఏఈని ఆదేశించారు.పలు మంచినీటి వాటర్ ట్యాంకులను పరిశీలించారు.పట్టణంలోని నంది గల్లీలోని బ్రహ్మంగారి గుట్ట వద్ద ఏర్పడిన లీకేజీని పరిశీలించారు. సమయపాలన పాటిస్తూ మంచి నీటిని వదలాలని వాటర్ మ్యాన్ లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీ కుమార్,వర్క్ ఇన్స్పెక్టర్స్,వాటర్ మ్యాన్స్ పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శనివారం,
01.03.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



vishalabharathi Telugu Daily



### డాక్టర్లను రాక్షసులుగా పోల్చడం సమంజసం కాదు

**తొర్రూరు, విశాలభారతి:**

డాక్టర్లను రాక్షసులుగా పోల్చడం సమంజసం కాదని నోదా హాస్పిటల్ డాక్టర్ సురేందర్ నాయక్ అన్నారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన సంఘటన ఆయన వివరించడం జరిగింది. తొర్రూర్ మండలంలోని హరిపిరాల గ్రామానికి చెందిన శాంతమ్మ కొద్ది రోజుల క్రితం కడుపు నొప్పితో తొర్రూర్ లోని ఒక ప్రైవేట్ హాస్పిటల్ లో చేరింది.అక్కడే డాక్టర్ స్పందిస్తూ ఆమెకి చికిత్స అందించే ఉద్దేశంతో ఆమెను స్కానింగ్ కి పంపించగా రిపోర్టులో ఎలాంటి లక్షణాలు లేకపోవడంతో ఆపరేషన్ చేస్తుండగా కంతిని గుర్తించి డాక్టర్ కంతిని తొలగించకుండా కేవలం అపెండెక్స్ పేగును మాత్రమే తొలగించడం జరిగింది.ఒకవేళ కంతిని తొలగించినచో పేషెంట్ కు ప్రాణాపాయం ఉంటుందనే ఉద్దేశంతో కంతిని తొలగించకుండా కుట్లు వేసి ఆపరేషన్ పూర్తి చేయడం జరిగింది.



## కీతవారిగూడెంని మండల కేంద్రంగా ప్రకటించాలి

- అఖిలపక్షాల డిమాండ్

**గరిడేపల్లి, విశాలభారతి:**

సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలోని కీతవారిగూడెం సమీప ప్రాంతాలు కలుపుకుని కొత్త మండలంగా ప్రకటించాలని అఖిలపక్షాలు డిమాండ్ చేశారు.శుక్రవారం మండల కాంగ్రెస్ మైనారిటీ అధ్యక్షుడు షేక్ చాంద్ మియా అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీతవారిగూడెం చుట్టూ 14 గ్రామ పంచాయతీలు, నాలుగు రెవెన్యూ గ్రామాలు,ఏడు ఎంపీటీసీ స్థానాలు కలిగి, గ్రామాలన్ని ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయన్నారు. మండల కేంద్రమైన గరిడేపల్లికి వెళ్లడానికి ఇక్కడి ప్రజలు ఇక్కట్లు పడుతున్నారని ఆయన తెలిపారు. 06032025 రోజున కీతవారి గూడెం గ్రామ శ్రీ సత్యసాయి కళ్యాణ మండపంలో అఖిల పక్షం సమావేశం నిర్వహించి నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి విన్నవించుకోవడం జరుగుతుందన్నారు.అఖిలపక్ష నాయకులందరూ హాజరవ్వాలని కోరారు .ఈ సమావేశంలో కీత సోమయ్య, నర్సింగ్ వెంకటేశ్వర్లు, తుమ్మల సైదులు,పోలంపల్లి ఆనంద్ బాబు,నర్సింగ్ అంజయ్య,నాగ సైదులు,బాదే నర్సయ్య, బొల్లెపల్లి సైదులు,బొల్లెపల్లి శ్రీను,కోమరాజు నాగయ్య, బండారు సైదులు,బండారు బిక్షం,బండారు అంజయ్య, పిడమర్తి సాయి తదితరులు పాల్గొన్నారు.



## లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో ఘనంగా సైన్స్ డే దినోత్సవం

**బాల్కొండ,విశాలభారతి**

భీమ్‌గల్ మండలంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో ఘనంగా సైన్స్ డే దినోత్సవం నిర్వహించారు. సైన్స్ డే సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు తమ ప్రతిభతో విజ్ఞాన శాస్త్రనికి సంబంధించిన డ్రాయింగ్స్,పరిశోధన పరికరాలు ప్రదర్శించారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ షఫీ మాట్లాడుతూ...సివి రామన్‌కు నేషనల్ సైన్స్ డేకు సంబంధం ఏమిటి? సముద్రం నీలిరంగులో ఎందుకుంటుంది?ఆకాశం నీలి రంగులోనే ఎందుకుంటుంది?పగలు నక్షత్రాలు ఎందుకు కనపడవు?అసలు రామన్ ఎఫెక్ట్ అంటే ఏమిటి?ఎన్నో ప్రశ్నలు,మరెన్నో ఆసక్తికర అంశాలు వీటన్నింటికీ సమాధానం సివి రామన్ కను గొన్న సూత్రాలే ప్రామాణికం అని అన్నారు.నోబెల్ బహుమతి అందుకున్న మొట్టమొదటి భారతీయ శాస్త్రవేత్త సీవీ రామన్ అని,సైన్సు రంగంలో ఎవరూ చేయలేని సాహసాలను అత్యంత సునాయాసంగా చేధించి ప్రపంచ వినువీధిలో మన దేశ పతాకాన్ని రెపరెపలాడించారని తెలిపారు. వైజ్ఞానిక రంగంలో ప్రపంచ దేశాలను తలదన్నేలా భారత్ ను శక్తివంతగా చూపించారు.అప్పట్లోనే అబ్బురపరిచే ప్రయోగాలకు నిలువెత్తు వేదికలా నిలిచారు. రామన్ ఎఫెక్ట్ కనిపెట్టిన రోజునే దేశంలో జాతీయ సైన్స్ దినోత్సవం (నేషనల్ సైన్స్ డే) గా జరుపుకుంటున్నారు.అంతే కాకుండా భారతరత్న అవార్డు కూడా ఆయన ఖాతాలో చేరింది. విజ్ఞాన శాస్త్రం గురించి ఆయన చేసిన ప్రసంగం నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తోంది. అఖండ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు పొందిన రామన్ కు ఎన్నో గౌరవ డాక్టరేట్లు లభించాయి.1924లో ఇంగ్లండ్ రాయల్ సొసైటీ సభ్యుడయ్యాడు.1928లో రామన్ కు సర్ బిరుదు దక్కింది.1947లో ప్రతిష్ఠాత్మకమైన ఫ్రాంక్లిన్ మెడల్ లభించింది. సివి రామన్ రామన్ ఎఫెక్ట్ కనుగొని ప్రపంచాన్ని సంభ్రమాశ్చర్యాలలో ముంచాడు. తన అనన్య సామాన్య పరిశోధనా సామర్ధ్యంతో ఫిజిక్స్ రంగంలో రామన్ ఎఫెక్ట్ కనుగొని చరిత్ర సృష్టించిన ఫిబ్రవరి 28నే జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపుకొంటున్నాం.1987 ఫిబ్రవరి నుండి ప్రతి సంవత్సరం జాతీయ సైన్స్ దినోత్సవంగా భారత ప్రభుత్వం అధికారకంగా నిర్వహించుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాధా కిషన్ నాయర్, ప్రైమరీ స్కూల్ ఇన్చార్జ్ బిన్ను, ఏవో ప్రకాష్, కిషన్,శ్రీనివాస్,శివ పాల్,నరేందర్,కలీం,ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## విద్యార్థి ఒమేష్ మృతదేహం లభ్యం

- దాదాపు 46 గంటలు నీటిలోనే ఒమేష్
- మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని పలు నాయకులు నిరసన

**ఆమనగల్లు,విశాలభారతి :**



వెల్దండ మండలంలోని గుండాలలో ఈనెల 26న కోనేరులో గల్లంతైన విద్యార్థి ఓమేష్ ఆచూకీ శుక్రవారం ఉదయం లభ్యమయింది.దాదాపు 46 గంటలు నీటిలోనే ఉంది. ఎన్డీఆర్ఎఫ్ 10th బెటాలియన్ కమాండర్ కృష్ణావతార్ జి, ఆధ్వర్యంలో కానిస్టేబుల్ పృద్వి కుమార్,లవరాజు లు ఇద్దరు రెండవ రోజు ఆచూకీ లభించలేదు. మూడవరోజు శుక్రవారం ఉదయం రెండవ కోనేరులోకి ఎన్డీఆర్ఎఫ్ బృందాలు లోపలికి దిగి గాలింపు చర్యలు చేపట్టగా దాదాపు 120 ఫీట్లు లోతులో విద్యార్థి ఆచూకీ కనుగొన్నారు.మరో పెద్ద క్రేన్ సాయంతో దాదాపు మళ్లీ వెళ్లి ఓమేశ్ మృతదేహాన్ని బయటకు తీశారు.తల్లిదండ్రుల పాటు బంధువులు మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని పలు నాయకులు నిరసన వ్యక్తం చేశారు. సంఘటన స్థలానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చేరుకుని సహాయక కార్యక్రమాలను పర్యవేక్షించారు.అనంతరం కుటుంబ సభ్యులకు సానుభూతి సంతాపం వ్యక్తపరుస్తూ భరోసాగా ఉంటామని హామీ ఇచ్చారు. ఇలాంటి ఘటనలు జరగకుండా గుండం చుట్టూ రక్షణ చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

**మృతి చెందిన విద్యార్థి కుటుంబాన్ని ఓదార్చిన ఎమ్మెల్యే**

కల్వకుర్తి నియోజకవర్గంలోని వెల్దండ గుండాల రామలింగేశ్వర స్వామి ఆలయ గుండంలో పడి జెపి నగరంలో ఇంటర్ చదువుతున్న విద్యార్థి ఉమేష్ మృతి చెందాడు. నాలుగు రోజుల క్రితం గుండం నీటిలో పడిన మృతి చెందిన మృతదేహాన్ని శుక్రవారం రెస్క్యూ ఆపరేషన్ సిబ్బంది నుంచి వెలికి తీశారు.రిస్కు ఆపరేషన్ను అక్కడే ఉండి పర్యవేక్షించిన ఎమ్మెల్యే శుక్రవారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

# నీటి యాజమాన్య పద్ధతులపై అవగాహన సదస్సు

**బాల్కొండ,విశాలభారతి**




వరిసాగులో నీటిని ఆదాచేసుకునే పద్ధతులను రైతులు అలవర్చు కోవాలని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ కమ్యూనిటీ ఫెసిలిటేటర్ నోముల మహేందర్ తెలిపారు.శుక్రవారం భీమ్‌గల్ మండలం పురాణిపెట్ గ్రామంలో డాక్టర్ రెడ్డిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తడి, పొడి సాగుపైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ కమ్యూనిటీ ఫెసిలిటేటర్ నోముల మహేందర్ మాట్లాడుతూ వరిలో కలుపు మొక్కలని తొలగించిన తర్వాత పొట్ట దశ వచ్చే సమయం వరకు ఎక్కువ నీరు అవసరం ఉండదని కేవలం 45 తడులతో తడి పొడి విధానం పాటించి సాగు చేయవచ్చునని సూచించారు. నీరువృధా కాకుండా యాసంగిలో పంట చివరి దశ వరకు పొలాలకు సాగు నీరు అందించవచ్చు ఈ విధానంలో 30 సెంటీమీటర్ల ఎడబ్ల్యూడీ పైపును 15 సెంటీ మీటర్ల వరకు రెండు సెంటీమీటర్ల ఎడంలో రంధ్రాలు చేసుకొని జల్లెడ మాదిరి తయారు చేసుకుని దీన్ని పొలం గట్టు నుంచి మీటర్ దూరంలో రంధ్రాలు భూమికి సమాంతరంగా మునిగిపోయేలా అమర్చుకోవాలన్నారు.భూ ఉపరితలం నుంచి ఐదు సెంటీ మీటర్ల వరకు నీరు కిందకు పడిపోయినప్పుడు ఐదు సెంటీమీటర్ల మాత్రమే నీటిని అందించాలని రైతులకు సూచించారు.ఈ పద్ధతి పాటిస్తే నీటి వృధాను అరికట్టడంతో పాటు వరి పంట నుండి వెలువడే మీథేన్ వాయు వల్ల కలిగే గ్లోబల్ వార్మింగ్ ని తగ్గించి మనకు తెలియజేయకుండానే పర్యావరణ కాపాడుకోవడంతో పాటు 15 నుంచి 30% దిగుబడి సాధించవచ్చునని అన్నారు. క్షేత్రస్థాయిలో అవగాహనతో పాటు రైతులకు ఏడబ్ల్యూడి పైపులు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ కమ్యూనిటీ ఫెసిలిటేటర్ నోముల మహేందర్, గ్రామ రైతులు,సుంకరి గంగయ్య, దైడి సురేష్,హెచ్.ప్రశాంత్,శ్రీరామ్ సాగర్,గోపాల్,రమేష్,బాలరాజు కస్తూరి బాలరాజు, సుంకరి బావన్న,తదితర రైతులు పాల్గొన్నారు.

## తాగునీటి కష్టాలు తీరేదెన్నడో

- నీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు
- ఎండలు ముదిరేకొద్ది నీటి ఎద్దడి మరింత తీవ్రం
- మున్సిపాలిటీలో ఏడాది పొడవునా ఇదే సమస్య

**మణుగూరు, విశాలభారతి:**



వేసవి సమీపిస్తోంది,తాగునీటి ఎద్దడి ముంచుకొస్తోంది. పల్లెల్లో నీటి సమస్య రోజురోజుకు పెరుగుతోంది. భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. అయినా తాగునీటి పథకాలు, పైపుల మరమ్మతులు, మంచినీటి సమస్యలతో పల్లె ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. వేసవి సమీపిస్తుండడంతో తాగునీటి సమస్యను తీర్చేందుకు అధికారులు, పాలకులు చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జీవనదిగా పేరొందిన గోదావరిలో నీరు అడుగంటుతోంది. ఫిబ్రవరి నెలలోనే గోదావరి నీటిమట్టం తగ్గిపోతోంది. గోదావరిలో రోజురోజుకూ నీటి ప్రవాహం తగ్గిపోతుండటంతో రానున్న రోజులలో నీటి అవసరాలకు గడ్డుకాలం వచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచే ఎండలు దంచికొడుతున్నాయి. ఎండలకు తగ్గట్టుగా నీటివినియోగం పెరగటంతో పాటుగా గోదావరిలో నీటి ప్రవాహం తగ్గిపోతుండటం ప్రస్తుతం ఆందోళన కలిగిస్తోంది. మణుగూరు మున్సిపాలిటీలో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎండలు ముదిరేకొద్దీ నీటి ఎద్దడి మరింత తీవ్రమయ్యే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే పట్టణంలో భుగర్భజలాలు అడుగంటాయి. 500 లోతువరకు బోర్లు వేసినా, నీరు పడడంలేదు. ఉన్న ఒకటిఅర చేతిపంపులు కూడా ఒట్టి పోయాయి. దీంతో మున్సిపాలిటీ పరిధిలోని కమలాపురం గ్రామములో సుమారుగా 10 రోజుల నుండి మంచి నీళ్ళు రావడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఎక్కువ రోజులు నీటిసరఫరా లేకపోవడంతో పైపుల్లో పాచి పట్టిన నీరు సరఫరా అవుతోందని ఆ నీటిని తాగి రోగాల బారిన పడుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వేసవిని అధిగమించడం కోసం అధికారులు ముందుగానే అప్రమత్తం కావాలని ప్రజలు కోరుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ట్యాంకర్ల ద్వారా పూర్తిస్థాయిలో నీటి సరఫరా జరిగింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏడాదికి ఒకరూల్ మారుస్తూ, ట్యాంకర్లు కుదించుకుంటూ వచ్చి చివరకు ట్యాంకర్ల సరఫరానే నిలిపి వేశారని ప్రజలు ఎద్దేవ చేస్తున్నారు. మున్సిపాలిటీలో ఏడాది పొడవునా ఇదే సమస్య ఉంటుంది. ఈ నీటి సమస్యని పట్టించుకున్న నాథుడే లేరని పలువురు విమర్శిస్తున్నారు. కానీ అప్పటి నుంచి ఇప్పటికే రెండు వంతుల జనాభా పెరిగిపోయింది. దానికి అనుకూలంగా నీటి సరఫరా చేసే విధంగా సామర్ధ్యం పెంచాలని ప్రజలు కోరుతున్నారు.



## బాధితురాలికి రెండు లక్షల ఎల్ఓసీ అందజేత

**కూకట్ పల్లి, విశాలభారతి**

శేరిలింగంపల్లి నియోజకవర్గం కూకట్పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ లో నివాసం ఉంటున్న పోల మానస్వి వయస్సు (20) తకాయసు ఆర్థరైటిస్ తో బాధపడుతూ నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ బాధిత తండ్రి శంకర్ కూకట్పల్లి లోని GVR కార్యాలయంలో ఆశ్రయించడంతో శేరిలింగంపల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ జగదీశ్వర్ గౌడ్ ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిది కి దరఖాస్తు చేయించారు. వారికి రెండో దఫా 2,00,000 రూపాయల LOC మంజూరు అవ్వగా 29 అక్టోబర్ 2024 రోజున 2,50,000.రూపాయల LOC అందించామని జివిఆర్ తెలిపారు.ఆ LOC లెటర్ ను శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జగదీశ్వర్ గౌడ్ గొట్టుముక్కల వెంకటేశ్వర రావు చేతుల మీదుగా మనస్విని తల్లి శకుంతలకి అందజేశారు.ఈ సందర్భంగా ఎల్ఓసి బాధితులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి జగదీశ్వర్ గౌడ్ GVRకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## ఘనంగా పసుల అశోక్ యాదవ్ జన్మదిన వేడుకలు

- అశోక చక్రవర్తి ఫౌండేషన్ ద్వారా అశోక్ సేవలు అభినందనీయం
- కాంగ్రెస్ పార్టీలో అశోక్ మరింత ఉన్నతంగా ఎదగాలి
- ఎంఎంసి చైర్మన్ తీగల గిరిధర్

**నూతనకల్ విశాలభారతి:**

నూతనకల్ మండల యువజన కాంగ్రెస్ అద్యక్షులు పసుల అశోక్ యాదవ్ జన్మదిన వేడుకలు తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ పసుల అశోక్ యాదవ్ అశోక చక్రవర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక మంచి పనులు చేస్తూ కాంగ్రెస్ కార్యకర్తలను యువతను కలుపుకొని పోతూ ముందుకు సాగుతున్నాడని అశోక్ ఇంకా ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీనకేరకంటి వెంకన్న, నకేరకంటి మధు, లావుడ్యా శ్రీధర్ నాయక్ మండల ప్రధాన కార్యదర్శి ఇరుగు కిరణ్ ఎన్ ఎస్ యు ఐ మండల అద్యక్షులు ఉప్పుల మురళి యాదవ్ సోషల్ మీడియా కోఆర్డీనేటర్ బొల్క సైదులు యాదవ్ యువజన కాంగ్రెస్ నాయకులు సాబాది వాసుదేవ రెడ్డి,కొరివి గంగయ్య యాదవ్,బండపల్లి మహేష్ గౌడ్, బండపల్లి చందు, మడ్డి శ్రావణ్ గౌడ్, ముడ్ మోహన్ నాయక్, జటంగి గణేష్ యాదవ్, ఉప్పుల యలమంచి యాదవ్, బండపల్లి జలేందర్,బూడిద వాసు, బొల్లేపల్లి ఉపేందర్, ఉడుగుల బుల్లేష్, తాళ్ళపల్లి మహేష్, వీరమల్ల మహేష్, దండ లింగయ్య, కొమ్ము సురేష్ నూతనకల్ గౌడ సంఘం అధ్యక్షుడు బూడిద మల్లయ్య ఎన్ ఎస్ యు ఐ మండల కోఆర్డీనేటర్ మరికంటి అశోక్ అల్లునూరు గ్రామ శాఖ అధ్యక్షులు బంటు క్రాంతి కుమార్ ఎన్ ఎస్ యు ఐ నాయకులు వేల్పుల సంపత్ యాదవ్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## ఆర్టీఐ ఆక్టీవిస్ట్స్ ఫోరమ్ నియోజకవర్గ అధ్యక్షులుగా శివ నాయక్

**పాలకీడు, విశాలభారతి:**



సమాచార హక్కు చట్టం ఆక్టీవిస్ట్స్ ఫోరమ్ సూర్యాపేట జిల్లా హుజుర్నగర్ నియోజక వర్గం అధ్యక్షులు గా,పాలకవీడు మండలం బెట్టే తండ గ్రామానికి చెందిన ధీరావత్ శివ నాయక్ నియమితులయ్యారు. జిల్లా అధ్యక్షులు రామక్రిష్ణ,ప్రధాన కార్యదర్శి జానకి రాములు సూచనల మేరకు శుక్రవారం రాష్ట్ర అధ్యక్షులు బత్తుల గణేష్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైయిన శివ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులను సమన్వయం చేసుకుంటూ,జిల్లాలో సమాచార హక్కు చట్టం పకడ్బందీగా అమలుకు కృషి చేస్తానని, ఆర్టీఐ పై అవగాహన కార్యక్రమాలు చేపడతానని, సొసైటీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. సహా చట్టం విషయంలో ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

# సినిమా

శనివారం, 01.03.2025 హైదరాబాద్




## cinema updates

# విశ్వంభర రిలీజ్ ఎప్పుడు



మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా నటిస్తోన్న 'విశ్వంభర' రిలీజ్ కోసం ప్రేక్షకాభిమానులు ఎంతో ఎగ్జైట్ మెంట్ తో ఎదురు చూస్తోన్న సంగతి తెలిసిందే. సంక్రాంతికి రిలీజ్ అవ్వాల్సిన సినిమా అనివార్య కారణలతో వాయిదా పడింది. అప్పటి నుంచి రిలీజ్ తేదీపై సరైన స్పష్టత రాలేదు. మార్చి లేదా? ఏప్రిల్ , మేలో రిలీజ్ అవుతుందనే కొత్త ప్రచారం షురూ అయింది. అయితే మేకర్స్ ఈ ప్రచారంపై ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇప్పటికే వాయిదా పడిన నేపథ్యంలో ఎట్టి పరిస్థితుల్లో సమ్మర్ కి షురూ అవుతుందని అంతా నమ్ము తున్నారు. అయితే ఈ సినిమా రిలీజ్ ఇంకా వాయిదాల పర్వం కొనసాగేలా కనిపిస్తోంది. ఈ సినిమాకి సంబంధించి రిలీజ్ తేదీపై స్పష్టత రావాలంటే డిజిటల్ బిజినెస్ క్లోజ్ అయితే గానీ రాదని తాజా సమాచారం. ప్రస్తుతం దానికి సంబంధించిన చర్చలు జీ స్టూడియోస్ తో జరుగుతున్నాయట. ఆ డీల్ ఎప్పుడు పూర్తవుతుందన్నది ఇంకా క్లారిటీ రాలేదు. అది ఇంకా చర్చల దశలో ఉంది. డీల్ క్లోజ్ అయితే జీ స్టూడియోస్ సూచించిన స్ట్రీమింగ్ స్లాట్ ప్రకారం మేకర్స్ రిలీజ్ తేదీ ప్రకటించాలని చూస్తున్నారట. దీనిపై మార్చిలో ఓ క్లారిటీ వచ్చే అవకాశం ఉందంటున్నారు. అంటే మార్చిలో రిలీజ్ తేదీని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ఈనేపథ్యంలో జులైలో సినిమా రిలీజ్ అయ్యే అవకాశాలున్నాయంటున్నారు. కొంత పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కూడా పూర్తి కావాల్సి ఉందట. 'విశ్వంభర' సోషియో ఫాంటసీ చిత్రం కావడంతో సీజీ వర్క్ అధికంగానే ఉంది. సీజీ కోసం నెలల తరబడి పనిచేస్తున్నారు. అవసరం మేర విదేశాల్లో కూడా కొంత సీజీ వర్క్ జరుగుతుంది. అందుకు తగ్గట్టు ప్లాన్ చేసుకుని మేకర్స్ ముందుకెళ్తున్నారు. థియేట్రికల్ గా సినిమాకి పెద్ద ఎత్తున బిజినెస్ జరిగినట్లు తెలుస్తోంది.

# కన్నప్పకు సరైన టైమ్..



టాలీవుడ్ హీరో మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ కన్నప్ప.. రిలీజ్ కు రెడీ అవుతున్న విషయం తెలిసిందే. మహాశివుడు పరమ భక్తుడు కన్నప్ప జీవిత ఆధారంగా సినిమాను ముఖేష్ కుమార్ తెరకెక్కిస్తున్నారు. 24 ఫ్రేమ్స్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై డైలాగ్ కింగ్ మోహన్ బాబు.. భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. మూవీలో కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రీతి ముకుందన్ హీరోయిన్ గా నటిస్తుండగా.. పాన్ ఇండియా లెవెల్ లో అనేక మంది నటీనటులు ప్రాజెక్ట్ లో భాగమయ్యారు. ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్ లాల్, కాజల్ అగర్వాల్, మధుబాల, శివరాజ్ కుమార్, శరత్ కుమార్, బ్రహ్మానందం, బ్రహ్మాజీ తదితరులు.. గెస్ట్ రోల్స్ లో సినిమాలో సందడి చేయనున్నారు. అయితే పాన్ ఇండియా లెవెల్ లో ఏప్రిల్ 25వ తేదీన సినిమాను రిలీజ్ చేస్తామని ఇప్పటికే మేకర్స్ అనౌన్స్ చేశారు. ఆ నేపథ్యంలోనే కొద్ది రోజుల క్రితం ప్రమోషన్స్ స్టార్ట్ చేశారు. రీసెంట్ గా వేగం పెంచారు. శివరాత్రి సందర్భంగా శ్రీకాళహస్తి ఆలయానికి వెళ్లి అక్కడ టీజర్ ప్లే చేశారు. మార్చి 1వ తేదీన టీజర్ ను రిలీజ్ చేస్తామని తెలిపారు. ఆ తర్వాత నిన్న ముంబైలో ఈవెంట్ నిర్వహించారు. టీజర్ ను లాంచ్ చేశారు. ఇప్పుడు మరిన్ని కార్యక్రమాలు ప్లాన్ చేస్తున్నారు. అయితే రిలీజ్ కు ఇంకా 45 రోజుల సమయం ఉంది. దీంతో మేకర్స్.. ఆడియన్స్ లో బజ్ భారీగా క్రియేట్ అయ్యేలా చేయాలి. వరుస ఈవెంట్లు, ఇంటర్వ్యూలు సహా అన్నీ గ్రాండ్ గా నిర్వహించాలి. మూవీలో స్టార్ క్యాస్టింగ్ అంతా గెస్ట్ రోల్స్ చేస్తుండడంతో.. వేరే లెవెల్ లో అంచనాలు క్రియేట్ చేయాల్సిందే. కానీ ఇప్పుడు అనుకున్నంత ప్రేక్షకుల్లో హైప్ క్రియేట్ అవ్వలేదు. దీంతో మంచు విష్ణు దానిపై ఫోకస్ చేయాలని, ఇదే సరైన టైమ్ అని అంటున్నారు నెటిజన్లు. ఇప్పటికే కన్నప్ప స్టోరీ అందరికీ తెలుసని, కాబట్టి థియేటర్లకు అందరినీ రప్పించేలా చేయాలని చెబుతున్నారు. ఓల్డ్ వెర్షన్ లో చాలా మార్పులు చేశామని చెబుతున్న విష్ణు.. దాన్ని ప్రజల్లో తీసుకెళ్లాలని సూచిస్తున్నారు. నార్త్ లో బజ్ క్రియేట్ చేస్తే తిరుగుండదని అంటున్నారు. రీసెంట్ గా మహాకుంభమేళా జరగడంతో.. ఆ ఆధ్యాత్మిక సెంటిమెంట్ ను ఉపయోగించుకోవాలని చెబుతున్నారు. అన్నింటికీ సరైన టైమ్ ఇదేనని.. ఆడియన్స్ కు భారీగా రీచ్ అయితే ఇంకా తిరుగులేదని అంటున్నారు. మరి మేకర్స్ ఏం చేస్తారో చూడాలి.


# మేలో మూడు భారీ సినిమాలు..




2025లో అప్పుడే రెండు నెలలు కంప్లీట్ అయిపోయాయి. అయితే ఇప్పటి వరకు అనేక సినిమాలు థియేటర్లలో రిలీజ్ అయ్యాయి. కొన్ని హిట్స్ గా మారాయి. మరికొన్ని అంచనాలకు మించి రాణించాయి. ఇంకొన్ని బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను రాబట్టాయి. అయితే ఎప్పటిలానే పలు సినిమాలు బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచాయి. అయితే మార్చిలో వివిధ సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నాయి. కిరణ్ అబ్బవరం దిల్ రూబా సహా అనేక చిత్రాలు రిలీజ్ కానున్నాయి. బాక్సాఫీస్ వద్ద తమ లక్ ను టెస్ట్ చేసుకోనున్నాయి. అదే సమయంలో ఇప్పుడు మే నెలలో విడుదల కాబోయే సినిమాల కోసం జోరుగా చర్చ సాగుతోంది. నేచురల్ స్టార్ నాని.. హిట్ 3 మూవీతో మే నెలను స్టార్ట్ చేయనున్నారు. శైలేష్ కొలను దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఆ సినిమాలో నాని అర్జున్ సర్కార్ గా పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపిస్తారని ఇప్పటికే క్లారిటీ వచ్చేసింది. రీసెంట్ గా వచ్చిన టీజర్ కు ఆడియన్స్ నుంచి సూపర్ రెస్పాన్స్ వచ్చింది. భారీ బజ్ క్రియేట్ చేసింది. హిట్ ఫ్రాంచైజీలో మూడో సినిమాగా వస్తుండడం, ఇప్పటికే స్ట్రాంగ్ ఫ్యాన్ బేస్ ఉండటంతో.. హిట్ 3 విజయం సాధిస్తుందని అంటున్నారు. హిట్ 3 రిలీజ్ కాబోయే మే1న కోలీవుడ్ స్టార్ హీరో సూర్య రెట్రోతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమాపై మంచి హోప్స్ పెట్టుకున్నారు. రీసెంట్ గా కంగువా ఫ్లాప్ అవ్వడంతో సూర్య.. ఈ మూవీతో హిట్ కొడతారని అంతా అంచనా వేస్తున్నారు. వింటేజ్ యాక్షన్ నేపథ్య చిత్రంగా మూవీ ఉండనుందని టాక్. మే నెలాఖరులో 30వ తేదీన విజయ్ దేవరకొండ కింగ్ డమ్ విడుదల కానుంది. సినిమాలో విజయ్.. కొత్త అవతార్ లో కనిపించనున్నట్టు ఇప్పటికే క్లారిటీ వచ్చింది. టీజర్ లో విజయ్ పోలీస్ గెటప్ లో ఓ రేంజ్ లో కనిపించడం, బ్యాక్ డ్రాప్ సీరియస్ అండ్ ఇంట్రెస్టింగ్ గా ఉండడంతో ఆడియన్స్ లో సినిమాపై ఆసక్తి పెరిగింది. విజయ్ నుంచి స్పెషల్ కంటెంట్ వస్తుందని అంతా అంచనా వేస్తున్నారు.

# సెగలు పుట్టిస్తున్న శివంగి

బుల్లితెర ముద్దుగుమ్మలు అంటే ఒకప్పుడు చిన్న చూపు ఉండేది. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. సినిమాల్లో హీరోయిన్స్‌కి ఏ స్థాయి గుర్తింపు అయితే ఉంటుందో ఆ స్థాయిలో లేదా అంతకు మించి గుర్తింపును బుల్లి తెర ముద్దుగుమ్మలు దక్కించుకుంటున్నారు. భాష ఏదైనా బుల్లి తెరకు ఇప్పుడు మంచి గుర్తింపు లభిస్తుంది. సీరియల్స్‌కి ఈమధ్య కాలంలో మంచి స్పందన వస్తున్న నేపథ్యంలో సీరియల్‌లో అయినా నటించేందుకు సిద్ధం అన్నట్లుగా హీరోయిన్స్ రెడీ అవుతున్నారు. వెండి తెర హీరోయిన్స్‌కి తగ్గకుండా బుల్లి తెర హీరోయిన్స్ ఇన్‌స్టాలో అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేస్తూ ఉంటారు. టీవీ సీరియల్స్ ద్వారా గుర్తింపు దక్కించుకున్న హీరోయిన్స్ ఇన్‌స్టాగ్రామ్‌లో అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా పాపులారిటీని సొంతం చేసుకుని హీరోయిన్స్‌గా ఆఫర్లు దక్కించుకున్న సందర్భాలు ఉన్నాయి. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఫోటోలు షేర్ చేస్తే ఇండస్ట్రీలో ఎంట్రీ దక్కుతుంది అనుకునే వారు చాలా మంది ఉన్నారు. అందుకే ఎంతో మంది అందాల ఆరబోత ఫోటోలతో మత్తెక్కిస్తూనే ఉంటారు. తాజాగా బుల్లితెర నటి శివంగి వర్మ తన అందమైన ఇన్‌స్టా ఫోటోలతో ఆకట్టుకుంటుంది. ఈ అమ్మడు షేర్ చేసిన మిర్రర్ సెల్ఫీ ఫోటోలతో ఆకట్టుకుంది. హిందీలో ఎన్నో సీరియల్స్‌లో శివంగి వర్మ నటించి మెప్పించింది. హమారీ సిస్టర్ దీదీ, బివి ఔర్ మైన్, భూతు ఇతర ప్రాజెక్ట్‌ల్లోనూ ఈమె కనిపించింది. బుల్లి తెర ద్వారా వచ్చిన గుర్తింపుతో ఇప్పటికే సినిమాల్లోనూ ఎంట్రీ ఇచ్చింది. బిచ్చగాడు 2 సినిమాలో ఈమె చేసిన ప్రత్యేక పాటకు మంచి స్పందన వచ్చింది. ముఖ్యంగా ఈ అమ్మడు తన అందంతో ఎప్పుడూ సోషల్ మీడియా ద్వారా ఆకట్టుకుంటూ ఉంటుంది. తాజా ఫోటో షూట్‌తో అసలు చూపు తిప్పకోనివ్వడం లేదు. నడుము అందం చూపిస్తూ క్లీ వేజ్ షో చేసిన ఈ అమ్మడి ఫోటోలకు తెగ లైక్స్ వస్తున్నాయి. మత్తు కల్లతో మిర్రర్ ముందు నిల్చుని తన అందమైన నడుమును క్లిక్ అనిపించిన ఈ అమ్మడు నాభి అందంతో మతి పోగొడుతోంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఈ రేంజ్‌లో అందాల ఆరబోత చేసిన ముద్దుగుమ్మ శివంగికి బాలీవుడ్‌లో మరిన్ని మంచి ఆఫర్లు దక్కాల్సిన అవసరం ఉంది అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ అమ్మడి ఫోటోల జోరు, అందం, ఫిజిక్ చూస్తూ ఉంటే కచ్చితంగా భవిష్యత్తులో మంచి ఆఫర్లు దక్కించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. బుల్లి తెర నుంచి పర్మినెంట్‌గా వెండి తెరపై ఈ అమ్మడు సందడి చేస్తుందేమో చూడాలి.





Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.